RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 12 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, జూన్, 29, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 12 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday, June,29,2025 | PAGES : 8 RS : 4 /- |



## మీడియా ఆఫీస్‌పై దాడి..

## వారిపై చర్యలకు టీపీసీసీ చీఫ్ డిమాండ్

**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** మహాన్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మహాటీవీ ఆఫీస్ పై బీఆర్ఎస్ శ్రేణులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రియాక్ట్ అయ్యారు. పత్రిక విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని అన్నారు. మీడియా ప్రసారాలు, కథనాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే, వాటిని తెలియజేసేందుకు చట్టపరమైన మార్గాలు ఉన్నాయని సూచించారు. మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం సహించ దగిన పరిణామం కాదని పేర్కొన్నారు. మీడియో ఆఫీస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అనుచిత కథనాలు ప్రసారం చేశారని ఇవాళ మధ్యాహ్నం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మహా న్యూస్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని ప్రముఖ నాయకులు తప్పుబట్టారు. బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్, టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు ఖండించారు.

## పిజెఆర్ నేతృత్వంలోనే

# హైటెక్ సిటీకి పునాది

## - పిజెఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీయం రేవంత్

**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** పి.జనార్ధన్ రెడ్డి(పిజెఆర్) నేతృత్వంలోనే హైదరాబాద్ హైటెక్ సిటీకి పునాది పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ టెక్నాలజీ పార్క్ పేరును హైటెక్ సిటీగా మార్చి చంద్రబాబు అభివృద్ధి చేశారని సిఎం చెప్పారు. శనివారం ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన పిజెఆర్ ఫ్లైఓవర్ ను సిఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పిజెఆర్ ఇల్లు ఒకప్పుడు జనతా గ్యారేజీగా ఉండేదని, జంట నగరాల సమస్యల పరిష్కారం కోసం ఆయన కృషి చేసేవారని చెప్పారు. ఆయన కృషి వల్లే నగరంలోకి సురక్షిత మంచి నీరు వచ్చిందని తెలిపారు. వాజ్‌పేయీ, పీవీ నర్సింహారావు వల్లే ఐటీ కారిడార్ అభివృద్ధి జరిగిందన్నారు.కాగా, రూ.182.75 కోట్లతో 6లేన్లతో 1.2 కిలోమీటర్ల మేర పిజెఆర్ ఫ్లైఓవర్ ను నిర్మించారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభం కావడంతో గచ్చిబౌలి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గనుంది.ఎంత మంది రాక్షసులు అడ్డుపడినా మా యజ్ఞం ఆగదు. రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యంతో మాతో అందరూ కలిసి వస్తున్నారు. 3 లేయర్లుగా తెలంగాణ.. 3 లేయర్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని విభజించాలనుకున్నాం. రాబోయే 100 రోజుల్లో కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతాయి.



కాలుష్యం కారణంగా నేడు ఢిల్లీలో నివసించలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రాజధానిలో నివసించలేని పరిస్థితి వచ్చిందంటే పాలకులు సరైన ప్రణాళిక లేకపోవడమే కారణం. వర్షం వస్తే చెన్నై అతాలాకుతలమవుతోంది, బెంగళూరు నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుంటోంది. ఢిల్లీ,చెన్నై, బెంగళూరు నుంచి మనం నేర్చుకోవాలి. హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. డీజిల్ బస్సులను నగరానికి అవతలకు పంపించే చర్యలు చేపట్టాం.

నగరంలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం. ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు కొంటున్న వారికి పన్ను లేకుండా చేస్తున్నాం. చెరువుల్లో అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చి వేసింది. వరద నీళ్లు వెళ్లేందుకు చెరు వుల్లేకుండా కొందరు కబ్జాలు చేశారు. బతుకమ్మకుంటను భారాస నాయకులు ఆక్ర మించుకుంటే.. కబ్జా నుంచి విడిపించాం. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి చేస్తే 5లక్షల ఉద్యోగాలు వచ్చాయి. హైదరాబాద్‌పై ఒత్తిడి పెరుగుతున్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని చేపట్టాం. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోంది.



## నిందితులను ఖఠినంగా శిక్షిస్తాం

### మహాన్యూస్‌పై దాడిని ఖండించిన సీయం

**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** తెలంగాణ రాష్ట్రంలో మహా న్యూస్ కార్యాల యంపైజరిగిన దాడి గురించే చర్చ జరుగుతోంది. అయితే ఈ సంఘటనపై తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ కూడా పెట్టారు. మహా టీవీ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే... ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పోస్ట్ పెట్టారు.ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సమర్ధనీయం కాదని..చురకలు అంటించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారని.. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు మహా న్యూస్ ఆఫీస్‌పై దాడిని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. మీడియాలో వచ్చే కథనాలు అలాగే ప్రసారాలపై అభ్యంతరాలు ఉంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చని గుర్తు చేశారు. కానీ ఇలా దాడి చేయడం ప్రజాస్వామ్య విధానంకాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరానికి పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే.. కొందరు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలావ్యవహరించడం కరెక్ట్ కాదని నిప్పులు చెరిగారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారని... నిందితులపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

## భవిష్యత్‌లో శుభాంశు శుక్లా మరిన్ని విజయాలు సాధించాలి



### వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,జూన్,28:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా ఖ్యాతి పొందిన శుభాంశు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటించారు. శనివారం,జూన్ 28 ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి కార్యాలయం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. శుభాంశు శుక్లాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారని, అక్కడ మిషన్ విజయవంతం కావాలని,భవిష్యత్‌లో శుభాంశు శుక్లా మరిన్ని విజయాలు సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు శుభాంశుతో మోదీ మాట్లాడుతున్న ఫోటోను షేర్ చేసింది పీఎం కార్యాలయం. కాగా, భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12 గంటలు దాటి ఒక నిమిషం. అమెరికాలో ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్.పదేపదే వాయిదాల అనంతరం, యాగ్జియం మిషన్ వాణిజ్య మిషన్‌ను వెంట తీసుకుని స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. కాసేపటికే యాగ్జియం-4 క్యాప్సూల్ రాకెట్ నుంచి విడివడింది. మొత్తమ్మీద10నిమిషాల్లోనే భూమికి200 కి.మీ. ఎగువ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. గ్రూప్ కెప్టెన్‌గా శుభాంశు శుక్లా సగర్వంగా రోదసిలోకి ప్రవేశించారు. ఫలితంగాఅం తర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా శుభాంశు చరిత్ర సృష్టించారు. అయితే 14రోజుల పాటు ఇక్కడ పరిశోధనలు చేయనుంది శుభాంశు బృందం.

## కేటీఆర్ పై కథనాలు..

## మహాన్యూస్ కార్యాలయంపై దాడి



**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** హైదరాబాద్ లోని మహాన్యూస్ చానల్ ఆఫీస్ పై బీఆర్ఎస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. ఆఫీస్ డోర్లు, స్టూడియోతో పాటు కార్యాలయం బయట నిలిపి ఉంచిన కార్లపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత కథనా లు ప్రసారం చేశారని మధ్యాహ్నం బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓ తెలుగు న్యూస్ కార్యాలయం వద్ద శాంతి యుత నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కా స్త ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా న్యూస్ చానల్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన లో బీఆర్ఎస్ నాయకులు కూడా గాయపడినట్లు తెలుస్తోంది. టెలిఫోన్ టాపింగ్ వ్యవహారంలో తనతోపాటు పార్టీ నేతలపై అడ్డగోలుగా దుష్ప్రచారంచేస్తున్న వారికి భారత రాష్ట్ర సమితి వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. అబద్ధాలు అసత్యాలు దురుద్దేశపూర్వక ప్రచారా లు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చే శారు. కొంతమంది వ్యక్తులు మీడియా ముసుగులో కావాలనే ఇలాంటి నీచమైన దుష్ప్రచారం చే స్తున్నారని కొన్ని మీడియా సంస్థలు కొంత మందితో ఒక ముఠాగా మారి చేస్తున్న దుష్ప్రచా రంపై చట్టపరంగా తగిన సమాధానం చెబుతా మన్నారు. కొంతమంది మీడియా సంస్థల యజమానులు నా పైన వ్యక్తిగతంగా, మా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై విషం చిమ్ముతున్నారు. అలాంటి వ్యక్తుల వల్ల కానీ వారు వ్యక్తపరుస్తున్న నీచమైన అభిప్రాయాలు నాపైన వ్యక్తిగతంగా ఎలాంటి ప్రభావం చూపించవు.

## కోల్‌కతా లా కాలేజీ గ్యాంగ్ రేప్ కేసులో

# కీలక పరిణామం..



### - ఏసీపీ ప్రదీప్ కుమార్ ఘోషల్ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు

### - కేసును విచారించనున్న 5 మంది సభ్యుల బృందం

**కోల్‌కతా,జూన్, 28:**కోల్‌కతా లా కాలేజీ గ్యాంగ్ రేప్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తు కొనసాగించడానికి ఏసీపీ ప్రదీప్ కుమార్ ఘోషల్ పర్యవేక్షణలో 5 మంది సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై ఈ కేసును సిట్ దర్యాప్తు చేస్తోంది. కాగా.. దక్షిణ కోల్‌కతాలోని ఓ లా కాలేజీ క్యాంపస్‌లో జూన్ 25న మొదటి సంవత్సరం విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీ (20) అనే ఇద్దరు విద్యార్థులతో పాటు, కళాశాల సిబ్బంది మోనోజిత్ మిశ్రా (31) ను అరెస్ట్ చేశారు. తాజాగా సెక్యూరిటీ గార్డు పినాకి బెనర్జీని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.కాగా.. ఈ అంశంపై ఇప్పటికే బాధితురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. "లైంగిక చర్య జరిపే ఉద్దేశంతో నన్ను బలవంతం చేయడానికి ప్రయత్నించారు. నేను నిరాకరిస్తూ.. దగ్గరికి రాకుండా ప్రతిఘటించి మోనోజిత్‌ని వెనక్కి నెట్టేశాను. ఏడుస్తూ వదిలిపెట్టాలని వేడుకున్నాను. బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు.. అతడిని ప్రేమిస్తున్నాను అని చెప్పినా అంగీకరించలేదు. మోనోజిత్ కాళ్లు పట్టుకొని వదిలేయాలని ప్రాధాయపడినా.. వదల్లేదు. ఆ తర్వాత నన్ను సెక్యూరిటీ గార్డు రూమ్‌లోకి బలవంతంగా లాక్కెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. తీవ్ర భయాందోళనకు గురయ్యా. శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడి ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరినా ఎవరూ సహాయం చేయలేదు. ప్రధాన నిందితుడు అత్యాచారం చేస్తుంటే మిగతా ఇద్దరూ వీడియోలను రికార్డు చేశారు. నేను సహకరించకపోతే ఆ వీడియోలను అందరికీ చూపిస్తామని బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నించిన క్రమంలో హాకీ స్టిక్‌తో దాడి చేశారు. నాకు న్యాయం చేయండి" అని బాధితురాలు పోలీసులను కోరారు.

## కొండా మురళీకి

# మళ్లీ నోటీసులు...

**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వంలో దుమారాన్ని రేపాయి. వరంగల్ జిల్లాలోని సొంత పార్టీనే తలపై కొండా మురళి విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా కడియం శ్రీహరి, రేవూరి ప్రకా శ్ రెడ్డి వంటి సీనియర్ నేతలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదా స్పదంగా మారాయి. ఆ వ్యాఖ్యలు త్వరలో తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతీకూల ప్రభా వం చూపే అవకాశం ఉందని పార్టీ లో అంతర్గతంగా చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యం లో శనివారం టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ముందు కొండా మురళిని హాజరయ్యారు. కమిటీ ముందు తనపై ఫిర్యాదు చేసిన నేతలపైనే ఆయన ఫిర్యాదు చేశారు.



## తుది దశకు తెలంగాణ బీజేపీ

# కొత్త అధ్యక్షుడి ఎన్నిక..?

**హైదరాబాద్,జూన్ 28,తెలంగాణ దిశ:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక తుది దశకు చేరుకుంది. గత ఆరు నెలలుగా కొత్త సారథిపై ఉన్న ఉత్కంఠకు మరో ఐదు రోజులు తెరపడనుంది. ప్రెసిడెంట్ ఎన్నికలకు జాతీయ బీజేపీ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అదేవిధంగా సోమవారం పదవికి పోటీ పడుతున్న ఆశావహుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ వెల్లడించారు. జులై 1న ఎన్నికలు నిర్వహించిన రాష్ట్ర అధ్యక్షుడిని అదే రోజున అధికారికంగా కటిస్తామని తెలిపారు.అయితే మొదటి నుంచి పోటీలో ఎంపీలు ఈటల రాజేందర్,డీకేఅరుణ,రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్ ఉండగా.. మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మళీఅధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష రేసులో ప్రధానంగా ఇద్దరి మధ్యే పోటీ ఉన్నట్లు సమాచారం అందుతుంది.వారిలో మొదటి నుంచి పోటీలో ఉన్న ఈటల రాజేందర్ ఒకరు కాగా, అయితే దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన లేకపోయినప్పటికి బీజేపీ వర్గాల్లో తీవ్రంగా చర్చ జరుగుతుంది.

# ఎమర్జెన్సీకి యాభై సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజాస్వామ్య విలువలపై అవగాహన సదస్సు





**కుత్బుల్లాపూర్ జూన్ 28, (తెలంగాణ దిశ) :** భారతదేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా ఇంచార్జీ అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లా రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోషామహల్ మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి హాజరయ్యారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథిగా విచ్చేసిన చెవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్యానికి ఎదురైన సవాళ్లను గుర్తు చేశారు. "ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక గాఢమైన అధ్యాయమని ఆ కాలం మనకు తెలిపిన ప్రధాన బోధ రాజ్యాంగాన్ని మౌలిక హక్కులను కాపాడే బాధ్యత ప్రతి పౌరునిపైన ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై గౌరవం ఉండాలని, కాలానికి అనుగుణంగా పటిష్టంగా ఉండాలంటే ప్రజలలో చైతన్యం అవసరం అని ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ ఎమర్జెన్సీ కాలంలో దేశం ఎదుర్కొన్న తీవ్ర పరిణామాలను, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిని, స్వేచ్ఛాలపై విధించిన ఆంక్షలను సవివరంగా వివరిస్తూ ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్యంపై జరిగిన మూకుమ్మడి దాడి అని, యువత ఈ చరిత్రను తెలుసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ పాత్రను సమర్థవంతంగా పోషించాలని, అదేవిధంగా "రాజ్యాంగాన్ని తుంచి లక్షలాది మంది నిర్దోషులను జైళ్లకు నెట్టిన దుర్మార్గ పాలనను భవిష్యత్ తరాల కోసం గుర్తు చేసుకోవాలని,"మీడియాపై ఆంక్షలు, ప్రతిపక్షాలపై అక్రమ అరెస్టులు, ప్రజల హక్కుల కాలరాసే చర్యలు జరిగాయన్నారు. అలాంటి చీకటి రోజులు మళ్లీ రాకూడదనే హెచ్చరికే ఈ సభ ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి, పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు విగ్నేష్ చారి, వర్ధన్ రెడ్డి కూకట్ పల్లి ఇంచార్జ్ మాధవరం కాంతారావు, శివరాత్రి దామోదర్, నందనం దివాకర్, స్థానిక బిజెపి అధ్యక్షులు ప్రసాదరాజు నరేంద్ర చౌదరి బిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# నిజాంపేట్ 21వ డివిజన్ లో బోర్ వెల్, నూతన సిసి రోడ్డు పనులు ప్రారంభం






**కుత్బుల్లాపూర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ లో సాయి నగర్ స్మశాన వాటికలో శనివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొలను హనుమంత రెడ్డి నూతన సిసి రోడ్డును, స్మశాన వాటికలో బోర్వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేదల బస్తీలలో కనీస సౌకర్యాల కొరకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజల సంక్షేమం కొరకు పలు సంక్షేమ కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుందని ఆయన వివరించారు. సాయి నగర్ స్మశాన వాటికలో నీరు లేక స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నందున బోర్వెల్ పనులను వెంటనే ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశారు. అలాగే స్థానిక బస్తీలో సిసి రోడ్లను కూడా ప్రారంభిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, నగరశాఖ పార్టీ ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ కన్వీనర్ షేక్ బిక్కెన్షా, మల్లికార్జున్, ప్రవీణ్, నిర్మల, యాదమ్మ, చంద్రకళ, లక్ష్మి, అంజద్, రఫాత్, మురళి, మేడ శ్రీను, అఖిల్, రహీం, వాజిద్, శేఖర్, సంజీవరెడ్డి పెద్ద సంఖ్యలో బస్తివాసులు పాల్గొన్నారు. బస్తీలో అభివృద్ధి పనులను ప్రారంభించడానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలను బస్తి నాయకులు ఘనంగా సన్మానించారు.

# తీన్మార్ మల్లన్నకు నిజాంపేట్ బీసీ కోర్ కమిటీ సంఘీభావం



**కుత్బుల్లాపూర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :** బీసీల కొరకు కోర్ కమిటీ ఏర్పాటుచేసి వారి సమస్యలను పరిష్కరిస్తున్న నిజాంపేట్ కోర్ కమిటీ నేతలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అభినందించారు. శనివారం నిజాంపేట్ కోర్ కమిటీ వారు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిసి ఆయన చేస్తున్న బీసీల ఉద్యమానికి సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో బీసీల ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, కృషి చేస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు. అన్ని రంగాలలో బీసీలు ముందంజలో ఉండాలని అప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న కలిసిన వారిలో నిజాంపేట్ బీసీ కోర్ కమిటీ అధ్యక్షుడు లింగాల గంగాధర్, తెలంగాణ బిసి పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూధగాని హరిశంకర్ గౌడ్, వట్టే జానయ్య, బందారపు నరసయ్య గౌడ్, ఓదేలు యాదవ్, సింగారపు రవీందర్, భయ్యా వెంకటేశ్వర్లు యాదవ్, కుంచకు రమా, పడకంటి సాయిరాజ్, ఇంద్ర కంటి శ్రీనివాస్ గౌడ్, కుర్మయ్య, ఎంబరి రాజయ్య యాదవ్, కుంచాల పుల్లయ్య, గుండు దుర్గాప్రసాద్, జి కిషన్, గంజి బాలాజీ, గార్లి రాధిక, పొన్నపల్లి సతీష్, జనాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీ శ్రీ లక్ష్మీ గణపతికి మకర తోరణం ఆవిష్కరణ



**కుత్బుల్లాపూర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ జర్నలిస్టు కాలనీలో శనివారం శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో గల విఘ్నేశ్వరుడికి మకర తోరణం భక్తులు అందించారు. దాత కొరుమిల్లి శ్రీశైలం దుర్గ దంపతులు ఆలయ పూజారి రాకేష్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కమిటీ సభ్యులకు మకర తోరణాన్ని అందించారు. జర్నలిస్టు కాలనీ ఉపాధ్యక్షుడు ముక్క దేవేందర్ అనురాధ గుప్తా దంపతులు వెండితో చేసిన కండ్లు స్వామివారికి పూజలు చేసి ఆవిష్కరించారు. దేవస్థానం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గోవిందరావు, మెడికల్ షాపు రమేష్ లు దాతలను ప్రత్యేకంగా శాలువాలతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ క్యాంటీన్ పేరును మార్చడం అన్యాయం




**ఏఎస్ రావునగర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :** అన్నపూర్ణ క్యాంటీన్ రూ. 5 భోజన పథకం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్ పేరుగా మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం టిఆర్ఎస్ నేతలు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బందారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమం లో ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్ రెడ్డి, షేర్ మనేమ్మ, బేతల బాలరాజు, షేక్ అబ్దుల్ రహీమ్, సత్తెమ్మ, పడాల ఆనంద్, చిన్నారావు, పంతుల్ నర్సింహ, సుధాకర్, కాలేరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎలైట్ బాక్సింగ్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

## - క్రీడా పోటీల నిర్వహణతో యువ క్రీడాకారులను నూతన ఉత్తేజం- మరిన్ని జాతీయ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం:స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి





**హైదరాబాద్, జూన్ 28, (తెలంగాణ దిశ) :** వివిధ జాతీయ అంతర్జాతీయ పోటీలు నిర్వహించడం ద్వారా తెలంగాణ బావి క్రీడాకారులకు స్ఫూర్తి లభిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. శనివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎలైట్ బాక్సింగ్ నేషనల్ ఓపెన్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ జాతీయ అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా తెలంగాణ యువ క్రీడాకారుల్లో క్రీడాకారులకు ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రవేశపెట్టిన నూతన క్రీడా విధానం దేశంలోనే ఆదర్శవంతమైన విధానంగా నిలబడి తెలంగాణ క్రీడా భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చుతుందని అన్నారు. క్రీడా సంఘాలు ఫెడరేషన్లు నిర్వహించే కార్యక్రమాలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని రకాల సహాయ సహకారాలు ఇస్తుందని తెలిపారు. గత ఏడాది కాలం నుండి ఎన్నో టోర్నమెంట్లకు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు ఆతిథ్యం ఇచ్చిన హైదరాబాద్ రానున్న రోజుల్లో మరిన్ని టోర్నమెంట్లకు అతిథ్యం ఇస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సోహెల్, అజయ్ సింగ్ అన్నుమన్, తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు చాతిరి బాబురావు, రవీందర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ మాజీ కోశాధికారి మహేశ్వర్, మాజీపార్లమెంటుసభ్యులు మధు యాస్కి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# యూజీ విద్యార్థుల కోసం టీజీసీహెచ్ఈ, టి-సాట్ ఆధ్వర్యంలో స్పెషల్ లైవ్



**శేరిలింగంపల్లి, జూన్ 28 ( తెలంగాణ దిశ ) :** తెలంగాణ ఉన్నత విద్యామండలి (టిజిసిహెచ్ఇ), టి-సాట్ (తెలంగాణ స్కిల్స్ అకడమిక్స్ అండ్ ట్రైనింగ్) ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తిచేసుకుని ఉన్నత విద్య కోసం అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో వివిధ కోర్సులోకి వెళ్లే విద్యార్థుల కోసం ఈ నెల 30వ తేది సోమవారం ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్య పూర్తి చేసుకుని 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉన్నత చదువుల కోసం ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ తదితర కోర్సుల ఎంపికలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ లైవ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. టీజీసీహెచ్ఈ, టి-సాట్ సంయుక్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టి- సాట్ నిపుణ ఛానల్ లో రెండు గంటల పాటు కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యక్ష ప్రసారానికి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకృష్ణారెడ్డి సలహాలు-సూచనలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు నేరుగా సంభాషించ వచ్చని తెలిపారు.

ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో వైస్-ఛైర్మన్లు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్ కె. మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ తమ తమ సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని సీఈవో వివరించారు. ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులు లైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సలహాలు-సూచనల కోసం 040-2354 0326/726 టోల్ ఫ్రీ నెం. 1800 425 4039 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

# ఘనంగా టీటీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుగొండ సతీష్ బాబు జన్మదిన వేడుకలు





ఏఎస్ రావునగర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఉప్పల్ నియోజక వర్గం అడ్ హాక్ కమిటీ మెంబర్, ఏఎస్ రావునగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు నీరుకొండ సతీష్ బాబు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఉప్పల్ అడ్ హక్ కమిటి మెంబర్ గడ్డమీది రాములు యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్ సీనియర్ నేతలు బాలాజీ, శ్రీనివాసరావు, చల్లపల్లి నాగేశ్వరావు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నాగరాజు,చంటి, గోబేరు రమేష్, హరికృష్ణ, శ్రీనివాస్, బొప్పన శ్రీనివాస రావు, బొక్కా వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగేంద్ర ప్రసాద్, వెంకటేష్ , శ్రీకాంత్, రోహిత్, తేజ, కోటేశ్వరరావు, మధు, ఆనంద్, బిజెపి నాయకులు రమేష్యాదవ్, సీతారాంరెడ్డి, కిరణ్, పాత్రికేయులు మెరుగు చంద్రమోహన్, శనిగరం అశోక్, వేముల శంకర్, లక్కిడి బాలిరెడ్డి, సురేష్, సత్యనారాయణ, యాపాపురం రవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టుకు బదిలీపై వచ్చిన న్యాయమూర్తులకు ఘనంగా స్వాగతం







**కుషాయిగూడ, జూన్ 28, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడ లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులో బదిలీపై వచ్చిన న్యాయమూర్తులకు శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. తొలుత మల్కాజిగిరి కోర్టు నుంచి మిర్యాలగూడకు బదిలీ అయిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్ ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అదే విధంగా కూకట్ పల్లి కోర్టు నుంచి బదిలీపై వచ్చిన మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి తిరుపతి, కరీంనగర్ కోర్టు నుంచి బదిలీపై వచ్చిన మూడవ అదనపు జూనియర్ జడ్జి శ్రీమతి సరళ రేఖలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా న్యాయస్థానం బార్ అసోసియేషన్ తరపున సభ ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేవూరి అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ఎస్ ఎన్. శ్రీదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్, అసోసియేషన్ సెక్రటరీ బాపిరెడ్డి, కార్యవర్గ సభ్యులు మాధవి, ధనలక్ష్మి, రేణుక, వెంకటేష్, మురళి, శివకుమార్, రాధ ప్రసన్న, దినేష్, సౌరేష్, సాయి సందీప్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇంట గెలిచే ప్రయత్నంలో రాహుల్..!

"నాతో వచ్చేదెవరు.. యుద్ధం చేసేదెవరు?" అంటూ బాహుబలి సినిమాలో ఓటమి నైరాశ్యంలో ఉన్న సైన్యానికి ధైర్యం చెప్పి కార్యోన్ముఖులను చేసిన సైన్యాధ్యక్షుడి డైలాగ్ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరిస్థితి అలాగే ఉంది. ఓవైపు ప్రత్యర్థి భారతీయ జనతా పార్టీ ముప్పేట దాడి చేస్తోంది. కాంగ్రెస్ చేతిలో ఉన్న ఒక్కొక్క రాష్ట్రాన్ని కైవసం చేసుకుంటూ ముందుకెళ్తోంది. వరుసపెట్టి ఎన్నికల్లో గెలుపొందుతూ దూసుకెళ్తోంది. చాణక్యుడి రాజనీతితో పాటు అన్ని రకాల యుద్ధతంత్రాలను అమలు చేస్తూ గెలుపే పరమావధిగా ఆ పార్టీలో ప్రతి ఒక్కరూ కలసికట్టుగా శ్రమిస్తున్నారు. కానీ అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కాంగ్రెస్‌లో నెలకొంది. నేతలకు స్వార్థ ప్రయోజనాలు, పదవులు, తమ గెలుపు తప్ప పార్టీ గెలుపు ముఖ్యం కాదు. కొందరైతే ఉండేది ఇక్కడ (కాంగ్రెస్‌లో), పనిచేసేది మరో పార్టీ కోసం అన్నట్టుగా ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఇచ్చే తాయిలాలకు లొంగిపోయి సొంత పార్టీ ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తున్నారు. ఈ విషయం గ్రహించిన రాహుల్ గాంధీ.. పార్టీని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం చేపట్టిన రెండ్రోజుల కసరత్తులో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ పార్టీలో నెలకున్న పరిస్థితులపై అవగాహన పెంచుకున్న రాహుల్ గాంధీ గుజరాత్ పర్యటనలో కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీ కోసం పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలను గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. "గుజరాత్‌లో మా పార్టీలో రెండు రకాల కార్యకర్తలు ఉన్నారు. మొదటి రకం నిజాయితీగా పార్టీ కోసం శ్రమిస్తూ ప్రజలతో మమేకమై ఉన్నారు. రెండో రకం ప్రజలకు దూరంగా బీజేపీకి దగ్గరగా ఉన్నారు. ఆ పార్టీకి బీ–టీమ్‌గా పనిచేస్తున్నారు" అంటూ ఫైర్ అయ్యారు. గుజరాత్‌లో మూడు దశాబ్దాలుగా అధికారం అందుకోలేకపోవడానికి ఈ కోవర్టులే కారణమంటూ నిందించారు. అలాంటి వారు 10 మంది నుంచి 40 మంది వరకు ఉన్నా సరే.. వాళ్లందరినీ పార్టీ నుంచి తొలగించి ఒక సందేశం పంపాలి అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాజకీయాలు, చరిత్ర కాలంలో యుద్ధాలు ఒకటే. ప్రేమలో, యుద్ధంలో ఏదైనా సమంజసమే అని దానర్థం. గెలుపు కోసం బీజేపీ వంటి కొన్ని పార్టీలు అన్ని రకాల వ్యూహాలు, యుద్ధ తంత్రాలను అమలు చేస్తుంటాయి. ఆ క్రమంలో ప్రత్యర్థులను తమవైపు తిప్పుకోవడం ఒక వ్యూహం. అలాంటి వ్యూహాలకు సులభంగా చిక్కేది ఎవరంటే.. దేశంలోని కాంగ్రెస్ పార్టీ నేతలే. ఈ పరిస్థితి కేవలం గుజరాత్ వంటి రాష్ట్రానికే పరిమితం కాలేదు. తెలంగాణలోనూ కొందరు నేతలు భారత రాష్ట్ర సమితి కు కోవర్టులుగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ వెతికితే కోవర్టులు చాలా మంది కనిపిస్తారు. పార్టీ గెలిచే అవకాశం లేదన్న నిరాశ, నిస్పృహలు ఆవహించినప్పుడు ఈ తరహా పరిస్థితి ఎక్కువగా తలెత్తుతుంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయాలు విపరీతమైన ఖర్చుతో కూడుకున్నాయి. తాను గెలిచినా పార్టీ ఓడితే.. ఎన్నికల్లో పెట్టిన ఖర్చు తిరిగి రాబట్టుకొనే అవకాశం ఉండదు. ఇలాంటప్పుడు అధికారంలోకి ఉన్నవారితో చేతులు కలిపితే కనీసం పెట్టుబడి వెనక్కి వస్తుంది అన్నది కొందరి ఆలోచన. కొందరైతే ఇదంతా ఎందుకని.. ఏకంగా గెలుపొందిన తర్వాత పార్టీ ఫిరాయించి మరీ అధికార పక్షంలో చేరిపోతున్నారు. ఎలాగూ స్పీకర్ అధికారపక్షం నుంచే ఉంటారు కాబట్టి పదవీకాలం పూర్తయ్యేవరకు తమ అనర్హత వేటు వంటి చర్యలు ఉండవన్న భరోసా వారికి ఎలాగూ ఉంటుంది. కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన స్థాయిలో బీజేపీ వంటి సైద్ధాంతికంగా బలంగా ఉన్న పార్టీల నుంచి జరగవు. అంటే కాంగ్రెస్ పార్టీలో తమ నేతలను కట్టిపడేసే సైద్ధాంతిక బలం కూడా లేదని అర్థమవుతోంది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అన్న మాట తరచుగా వినిపిస్తూ ఉంటుంది. నిజమే. అది ఏ స్థాయిలో అంటే.. నేతలు పార్టీకి నష్టం కలిగినా ఫర్వాలేదు అన్న స్థాయిలో కుమ్మలాడుకునే స్థాయిలో అక్కడ ప్రజాస్వామ్యం ఉంటుంది. పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ సవాళ్లు, విమర్శలు లేవనెత్తినా సరే అక్కడ చెల్లుబాటవుతుంది. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర మరియు ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో జరిగిన అనేక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీలో జాతీయ స్థాయిలో అంతర్గత కలహాలు, గందరగోళంతో పోరాడుతోం దని స్పష్టంగా తెలుస్తుంది. శశి థరూర్ నుంచి ముంతాజ్ అహ్మద్ వరకు చాలా మంది సీనియర్ పార్టీ నాయకులు పార్టీలో తమ పాత్రలతో సంతోషంగా లేరని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ నాయకులు మాత్రమే కాదు, ఇండియా కూటమి సభ్యులు కూడా రాహుల్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ముందు ఇంట నెగ్గి, రచ్చ గెలవాలని.. ఆ క్రమంలో పార్టీలో ప్రక్షాళన చేపట్టి తనవెంట వచ్చే వారిని మాత్రమే ముందుకు తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు. తన నాయకత్వంపై సందేహాలు వ్యక్తం చేస్తున్న నేతలను వదిలించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. అందులో భాగమే తాజా హెచ్చరికలని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య
# పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
### సౌమ్య మిశ్రాను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే



**చర్లపల్లి, జూన్ 28 (తెలంగాణ దిశ) :** ఎన్నో యేండ్ల నుండి చర్లపల్లి డివిజన్ సంబంధించిన కాలనీల కి చెందిన రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్, ఎంఆర్‌ఆర్ కాలనీ నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షకాలం నుండి నీరు బయటికి పోలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జైలుకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జైళ్ల డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా అక్కడికి వెళ్లి సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారం రోజుల క్రితం సచివాలయంలో హెూం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన వెంటనే సౌమ్య మిశ్రాను సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ ,రెడ్డి కాలనీ ప్రెసిడెంట్ భూమి రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, జీవన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెలుమ రెడ్డి అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మి నృసింహస్వామి దేవస్థానం ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మినారాయణ జన్మదిన వేడుకలు





కీసర, జూన్ 28, తెలంగాణ దిశ) :శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మి నృసింహస్వామి దేవస్థానం ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మినారాయణ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు, పాత్రికేయులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## మహా న్యూస్ పై దాడి.. హేయమైన చర్య.. టీఎస్ జెయు
# నిందితులను కఠినంగా శిక్షించాలి డిమాండ్

**హైదరాబాద్, జూన్ 28, (తెలంగాణ దిశ):** నగరంలో మహా న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడి హేయమైన చర్యగా తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్ జెయు) పేర్కొంది. ఈ మేరకు ఘటన బాధ్యులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్షులు నారగొని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్ యుజె(ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర కోశాధికారి పాపని నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వాసు కుమార్, రాష్ట్ర నాయకులు ముత్యం ముఖేష్ గౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక కార్యాలయాలపై, జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు గుర్తు చేశారు. మీడియాలో వచ్చే కథనాలు అలాగే ప్రసారాలపై అభ్యంతరాలు ఉంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చునని వారు గుర్తు చేశారు. కానీ ఇలా దాడి చేయడం ప్రజాస్వామ్య విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహానగరానికి పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే.. కొందరు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం కరెక్ట్ కాదని నిప్పులు చెరిగారు. ఈ సంఘటనపై పోలీసులు నిస్పక్షపాతమైన విచారణచేయాలని కోరారు. నిందితులపై కఠినంగా వ్యవహరించాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావు లేకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని వారు కోరారు.

# కీసరలోని కేసరి హాస్పిటల్‌కు షోకాజ్ నోటీసులు







**కీసర, జూన్ 28, (తెలంగాణ దిశ) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కీసర గ్రామంలోని కేసరి హాస్పిటల్ నిర్వహణలో తీవ్రమైన అవకతవకలు వెలుగు చూశాయి. ముగ్గురు డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో నమోదు అయిన ఈ హాస్పిటల్ పేరుతోనే అదే డాక్టర్లు, సిబ్బంది వివరాలను వాడుతూ నాగారం ప్రాంతంలో రెండు క్లినిక్స్, కీసరలో మరో పోలీ క్లినిక్ కూడా నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సి. ఉమాగౌరీ కేసరి హాస్పిటల్ ను తనిఖీ చేసారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం అనేక నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు.

దీంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉమా గౌరీ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిసిపిఎన్ డిటి యాక్ట్ లేదా ఎంటిపి యాక్ట్ ఉల్లంఘిస్తూ నడుపబడుతున్న హాస్పిటల్స్, క్లినిక్స్, ల్యాబ్స్, డయగ్నొస్టిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తెలంగాణ జాగృతికి గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం మద్దతు



**కుత్బుల్లాపూర్, జూన్ 28, (తెలంగాణ దిశ) :**తెలంగాణ యూనిటెడ్ ఫ్రంట్, తెలంగాణ జాగృతి సంయుక్తంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం పూర్తిగా మద్దతుగా నిలుస్తుందని గ్రేటర్ హైదరాబాద్ వడ్డెర సంఘం అధ్యక్షుడు దండవుల స్వామి స్పష్టం చేశారు. ప్రధానంగా గత 70 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రత్యేక తెలంగాణ లో వడ్డెర సామాజిక వర్గానికి రాజకీయంగా, ఉద్యోగాలపరంగా ఏ ప్రాధాన్యతను ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అసెం బ్లీలో గాని, పార్లమెంట్లో గానీ వడ్డెర కులస్తులకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించకపోవడం వల్ల వడ్డెర కులస్తులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన వివరించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో 42% బీసీలకు రిజర్వేషన్ల ను కాంగ్రెస్ ఇచ్చిందని దానిని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని వడ్డెర సంఘం కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేసింది. 42 శాతం బీసీల రిజర్వేషన్లు అమలుప రిచాకనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని వడ్డెర సంఘం నేతలు డిమాం డ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఆళ్లకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

# కూటమిపైనే.. 'టిడ్కో' లబ్ధిదారుల ఆశలన్నీ..?

**చిత్తూరు,తెలంగాణ దిశ:**టీడీపీ 2014–19 మధ్యలోఅధికారంలో ఉన్నప్పుడు పట్టణ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ (టిడ్కో) ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టింది. 300,365,430 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు రకాల గృహ నిర్మాణాలను ప్రారంభించారు. 300 చదరపు అడుగుల గృహానికి లబ్ధిదారుడి వాటా రూ.500 కాగా, 365 చ.అడుగులకు రూ.50 వేలు, అలాగే 430 చ.అడుగులకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. ఈ మొత్తాన్ని లబ్ధిదారుల నుంచిఅధికారులు నిర్మాణానికి ముందే వసూలు చేశారు. ప్రతి యూ నిట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ రూ.1.50 లక్షల చొప్పున, మొత్తం రూ.3 లక్షలు ఉంటుంది. యూనిట్‌ను బట్టి బ్యాంకు రుణాలూ ఉంటాయి. టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నగర, పురపాలక సంఘాల్లో 17,395 టిడ్కో గృహాలను మంజూరు చేసింది. అప్పట్లోనే లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పునాది దశలో ఉన్న గృహాలను 2020 జూన్‌లోనే రద్దు చేసేసింది.

ఇలా ఉమ్మడి జిల్లాలో 6288 గృహాలు రద్దయ్యాయి. తిరుపతిలో 1200, చిత్తూరులో 672, మదనప ల్లెలో 1056, శ్రీకాళహస్తిలో 1632, పుంగనూరులో 624, పుత్తూరులో 576, నగరిలో 528 గృహాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వైసీపీ ప్రభుత్వం 6,288 మంది గృహాలను రద్దు చేసినా, వారు చెల్లించిన డిపాజిట్లను మాత్రం వెనక్కి ఇవ్వలేదు. రద్దయిన గృహాల్లో 1360 మంది రూ.500 వంతున చెల్లించిన రూ.6.80 లక్షలు, 2784 మంది రూ.50 వేల చొప్పున చెల్లించిన రూ.13.92 కోట్లు, 2384 మంది రూ.లక్ష చొప్పున చెల్లించిన రూ.23.84 కోట్ల డిపాజిట్లను వెనక్కి ఇవ్వలేదు.

## మరోమారు రెండు రాష్ట్రాల మధ్య పెరగనున్న వైరం..!

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వంతీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని నిర్ణయించింది. విభజన చట్టం ప్రకారం ఏదైనా నదిపై ప్రాజెక్టు నిర్మించాలంటే పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని, అయితే అది ఇవ్వకుండానే ప్రాజెక్టు ప్రకటన చేశారని తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య తాజా వివాదానికి కారణమయ్యేలా ఉంది. దీనిపై పోరాటం చేయాలని రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది. నదుల అనసంధానం చేస్తామని ఇప్పటికే ప్రటించిన చంద్రబాబు ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రకటించారు. తమను సంప్రదించకుండా ఇలా ప్రాజెక్టు ప్రకటించడంపై అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై కేంద్ర స్థాయిలో పోరాటానికి సిద్ధమైంది. ఏపీ చేపట్టే నదుల అనుసంధాన ప్రాజెక్ట్ బనకచర్లపై అభ్యంతరం చెబుతూ కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఘాటైన లేఖ రాయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎందుకు అభ్యంతరం చెబుతోంది... అనేవివరాలు తెలియ జేస్తూ లేఖలు రాయాలని స్పష్టం చేశారు. రెండు రాష్టాల్లో ఏ రాష్ట్రమైనా, ఏ నదిపైనైనా ప్రాజెక్టు చేపడితే జీఆర్‌ఎంబీ, కేఆర్‌ఎంబీ సహా పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని ఏపీ పునర్విభజన చట్టం స్పష్టం చేస్తోందని అంటోంది తెలంగాణ. ఇదే విషయాన్ని లేఖలో రాయాలని నిర్ణయించారు. బుధవారం నీటి పారుదల శాఖపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి బనకచర్లపై అభ్యంతరం తెలియజేస్తూ లేఖ రాయాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజర య్యారు. కృష్ణానదీ జలాల విషయంలో కూడారాజీ పడే ప్రసక్తి వద్దని సూచించారు. ట్రిబ్యునల్స్‌లో గట్టి వాదనలు వినిపించాలని స్పష్టంచేశారు. ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడీఏ–1956 సెక్షన్3 ప్రకారం జలాలు కేటాయించేలా వాదించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముప్పు అంశంపై కూడాహైదరాబాద్ ఐఐటీతో చేయిస్తున్న స్టడీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు,వాటి అనుమతుల విషయంలో పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## కౌశిక్ రెడ్డిని అలా వదిలేశారేంటీ..?

**కరీంనగర్,తెలంగాణ దిశ:** బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులు తెస్తున్నారు. హుజూరాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి తొలి సారి ఎన్నికయిన పాడి కౌశిక్ రెడ్డిఆది నుంచి తలనొప్పులు తెచ్చిపెడు తున్నారు. వివాదాస్పద కామెంట్స్ చేయడమే కాకుండా దూకుడుగా వ్యవహ రిస్తుండటం పార్టీకి ఒకరకంగా మైనస్ అనే చెప్పాలి. పాడి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ లోకి వచ్చారు. ఆయనకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. మొన్నటి ఎన్నికల ప్రచారంలోనే పాడి కౌశిక్ రెడ్డి సంచలనం సృష్టించారు. తనను గెలిపించ కుంటే కుటుంబ సభ్యులతో కలసి ఆత్మహత్యలు చేసుకుంటామని నియోజ కవర్గ ప్రజలను ఎన్నికల సమయంలో బెదిరించారనే చెప్పాలి చివరకు ఎట్టకేలకు గెలిచినా బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఆయన ఉత్త ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. అయితే గెలిచిన తర్వాత పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పార్టీమారినా పాడి కౌశిక్ రెడ్డి మాత్రం కారు పా ర్టీలోనే ప్రయాణిస్తున్నారు. అందరు ఎమ్మెల్యేల తీరు ఒకలా ఉంటే.. పా డి కౌశిక్ రెడ్డి తీరు మరోలా ఉంది. ఆయన ఎక్కడకు వెళ్లినా సమస్యే అ వుతుంది. అసెంబ్లీ సమావేశాల్లోనూ పార్టీ తరుపున రెచ్చిపోవడం, స్పీకర్ తో చివాట్లు తినడం మామూలయిపోయింది. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యే లపైపాడికౌశిక్ రెడ్డి చేసే వ్యాఖ్యలు వారిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెడుతు న్నాయి. దీంతో వివాదం తీవ్రమై చివరకు కాంట్రవర్సీకి దారితీస్తుందనే చెప్పాలి. అనేక సార్లు వివాదాలకు కారణమైన పాడి కౌశిక్ రెడ్డిని మాత్రం కారు పార్టీ కంట్రోల్ చేయలేకపోతుందంటున్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కసారి గెలిస్తేనే ఇంత ఫైర్ చూపిస్తుంటే.. ఇక మరోసారి గెలిస్తే ఎలా ఉంటుందోనని ప్రజాప్రతినిధులు సయితం ముక్కున వేలేసుకుంటున్నారు. సొంత పార్టీ నేతలు కూడా పాడి కౌశిక్ రెడ్డి యాటిట్యూడ్ ను తప్పుపడుతున్నారు. కేవలం కేసీఆర్, కేటీఆర్ ల వద్ద మన్ననలను పొందేందుకే అలా వ్యవహరిస్తుందన్నకామెంట్స్ వినపడుతున్నాయి. కరీంనగర్ లోనూ హుజూరాబాద్ ఎమ్మెల్యే సంజయ్‌పై ఆయన దూకుడుతో వ్యవహరి ంచిన తీరుపై రాజకీయ నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

## వడ్డీరేట్లు తగ్గితేనే వృద్ధి..!

ముంబై, : వచ్చే నెలలో జరిగే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పావు శాతమైనా (25బేసిస్ పాయింట్లు) తగ్గించాల్సిన అవసరం ఉన్నదని డ్యూషే బ్యాంక్ విశ్లేషకులు చెప్తున్నారు. వడ్డీరేట్ల కోతల్ని ఆలస్యం చేసినకొద్దీ దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టమేనని వారు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఇప్పటికైనా రెపోరేటును తగ్గించకపోతే మున్ముందు జీడీపీ వృద్ధిరేటును మరింతగా త్యాగం చేసినట్టవుతుందని వ్యాఖ్యానించడం గమనార్హం. 'రాబోయే ఫిబ్రవరి, ఏప్రిల్ ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును 0.25 శాతం చొప్పునఆర్బీఐ తగ్గిస్తుందని మేము భావిస్తున్నాం.

ఈ ఏడాది ప్రథ మార్ధం రెపోరేటు 6శాతానికి దిగొస్తుందని ఆశిస్తున్నాం' అన్నారు. వడ్డీరేట్ల కోతలు ప్రభావం చూపాలంటే భారత్‌లో 9 నెలలు పడుతుందని, ఫిబ్రవరి సమీక్షలో కోతలకు శ్రీకారం చుడితే ఆర్బీఐ సరైన నిర్ణయం తీసుకున్నట్టవుతుందని పేర్కొన్నారు.

**దాదాపు రెండేండ్లుగా..:** 'గత ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో వరుసగా గడిచిన 11ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు ఎక్కడి వక్కడే ఉన్నాయి. దీంతో దేశ జీడీపీ వృద్ధిరేటు చాలాచాలా క్షీణించిం ది. దీంతో ఇప్పుడు కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ఫిబ్రవరిలో జరిగే తొలి ద్రవ్యసమీక్షలోనైనా వడ్డీరేట్లు తగ్గుతాయని అంతా ఎదురుచూస్తున్నారు'అనిడ్యూషే బ్యాంక్ అనలిస్టులు చెప్పారు. రెండేండ్లపాటు వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచడం చిన్న విషయమేమీ కాదని తాజా నివేదికలో వ్యాఖ్యానించారు. కాబట్టి రెపోరేటు అరశాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గడం అవసరమ న్నారు.

గత ఏడాది అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ 1 శాతం మేర వడ్డీరేట్లను తగ్గించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. కాగా, గత నెల డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.22 శాతానికి తగ్గింది. అంతకుముందు నెల నవంబర్‌లో ఇది 5.48 శాతంగా ఉన్నది. ఇక ఈ ఏడాది జనవరి–జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఇంకా తగ్గి 4.30 శాతానికి రావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

**రూపీ పతనం దెబ్బ:** ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించడానికి రూపాయి క్షీణత ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారుతున్నది.

# టార్గెట్ కమ్మ సామాజిక వర్గం

**గుంటూరు,తెలంగాణ దిశ:** ఏపీలో రాజకీయాలు అంటేనే సామాజి క సమీకరణలపై ఆధారపడి ఉంటాయి. ఇక్కడ సామాజిక వర్గాలు రాజకీయాలను శాసిస్తుంటాయి. ఫలానా కులం ఫలానా పార్టీ అని చాలా సులువుగా చెప్పవచ్చు. కమ్మ సామాజిక వర్గం అయితే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. కాపులంటే జనసేన.. ఇలా రకరకాలుగా విశ్లేషించుకోవ చ్చు. అయితే ఒక రాజకీయ పార్టీకి బలమైన మద్దతుదారులుగా సామాజిక వర్గాలు ఉంటాయి. ఇవి సహజం కూడా. అయితే కొన్ని సామాజిక వర్గాలు కొన్ని పార్టీలను విపరీతంగా ద్వేషిస్తుంటాయి. 2019లో రెడ్డి సామాజిక వర్గం టిడిపిని ద్వేషించింది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కమ్మ సామాజిక వర్గం ద్వేషించింది. అయితే రాజకీయ పార్టీలకు సామా జిక వర్గాల మద్దతు మాట అటుంచితే.. శత్రువులుగా మారిపోవ డం ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే పార్టీలు ఇప్పుడు సామాజిక వర్గాల వ్యతిరేకి అనే ముద్ర పోగొట్టుకునేందుకు ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి. ఈ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలంగా పనిచేసింది కమ్మ సామాజిక వర్గం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం వ్యక్తులు ఏకతాటిపైకి వచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. దీనికి కారణం లేకపోలేదు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గం ఒక రకమైన దాడి జరిగింది. వారి ఆర్థిక మూలాలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సామాజిక వర్గానికి చెందిన వారి పరిశ్రమలను వెళ్ళగొట్టారు. వీటన్నింటికీ తోడు చంద్రబాబును జైలులో పెట్టి ఇబ్బంది పెట్టారన్న కసితో కమ్మ సామాజిక వర్గం ఒకే తాటి పైకి వచ్చింది. అయితే 2019లో రెడ్డి సామాజిక వర్గం చేసిన ఫైట్.. 2024 ఎన్నికల్లో కనిపించలేదు. అది జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది.

వాస్తవానికి ఏ సామాజిక వర్గాన్ని దూరం చేసుకోవాలని వ్యూహం ఉండదు ఏ రాజకీయ పార్టీకి. అందుకే జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన కొడాలి నానికి మంత్రి పదవి ఇచ్చారు. కానీ విస్తరణలో భాగంగా తీసేసారు. వల్లభనేని వంశీ మోహన్ లాంటి నేతలు వైసీపీలోకి ఫిరాయించారు. కరణం బలరాం వంటి సీనియ ర్ను ప్రలోభ పెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నా రు. దేవినేని అవినాష్ వంటి నేతకు ప్రోత్సహించారు. అయితే అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం మూలాలపై దెబ్బ తగలడంతో వారు వీటిని పరిగణలోకి తీసుకోలేదు. ఒకరిద్దరు నాయకుల తప్ప కమ్మ సామాజిక వర్గాన్ని తొక్కేసారన్న ఆరోపణలను మూటగట్టుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డికి దీని పర్యవసానాలు తెలిసాయి. అందుకే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. వల్లభనేని వంశీని పరామర్శించడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చాలామందికి నచ్చలేదు. కొంతమంది సీనియర్లకు కూడా ఇది మింగుడు పడలేదు. గత ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి వల్లభనేని వంశీ లాంటి నేతలు కారణం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడంతో పాటు కమ్మ సామాజిక వర్గానికి అండగా నిలిచారన్న అంశం ముఖ్యం. దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి వల్లభనేని వంశీని పరామర్శిం చారు. అటు తన వెంట కొడాలి నానితో పాటు దేవినేని అవినాష్ నుపెట్టుకున్నారు. చంద్రబాబు,తన కుమారుడు ఎదగాలన్న కోణం లోనే ఆలోచిస్తున్నారని.. కమ్మ సామాజిక వర్గంలో ఇతర నేతల ఎదుగుదల వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇదంతా కమ్మ సామాజిక వర్గం మద్దతు కోసమేనని ప్రచారం నడుస్తోంది. మద్దతు తెలపక పోయినా పర్వాలేదు కానీ.. కమ్మ సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని శత్రువుగా చూడకుండా చేయాలన్నదే జగన్ ప్లాన్ గా తెలుస్తోంది.

## మరో సిక్స్ లైన్ హైవే

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త నేషనల్ హైవేలు, గ్రీన్ ఫీల్డ్ హైవేల పనువు వేగంగా సాగుతున్నాయి. కొన్ని హైవేల పనులు ముగింపు దశకు చేరాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కీలమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఈ హైవే విశాఖ – రాయపూర్ మధ్య ఆరు వరుసలగా ఎకనామిక్ కారిడార్ ఎక్స్‌ప్రెస్ హైవే 130 సీడీగా నిర్మాణం అవుతోంది. రూ.20 వేల కోట్లతో ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో.. ఎలాంటి అడ్డంకులు లేకుండా దూరాభారాన్ని తగ్గించేందుకు కేంద్రం ఈ హైవే నిర్మాణ పనులు చేపట్టింది. త్వరలోనే నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఈ నేషనల్ హైవే ఛత్తీస్‌గఢ్ రాయపూర్‌లోని అభన్‌పూర్ దగ్గర గ్రీన్‌ఫీల్డ్ హైవేగా మొదలవుతుంది.. అక్కడి నుంచి ఉత్తరాంధ్రలోని పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా కొత్తవలస మండలం సంతపాలెం మీదుగా అనకాపల్లి జిల్లా సబ్బవరం దగ్గర ముగియనుంది. మూడు జిల్లాల పరిధి (విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి)లో రూ.3,215.81 కోట్ల విలువైన పనులు చేపట్టారు. ఈ క్రమంలో మూడు జిల్లాల్లో ఇంటర్ ఛేంజింగ్ ఫ్లైఓవర్లు నిర్మించారు. వీటితో గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి వాహనాలు మిగతా రోడ్లలోకి, హైవే పైకి వెళ్లడానికి వీలుగా ఉ ంటుందంటున్నారు. రాయపూర్–విశాఖ మధ్య దూరం 590 కి.మీ ఉంటే.. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో 464.662 కి.మీకు తగ్గుతాయంటున్నారు. ఈ హైవేతో ప్రయాణ సమయం 14 గంటల నుంచి 9 గంటలకు తగ్గుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఉత్తరాంధ్ర నుంచి సాధా రణ ప్రయాణికులతో పాటు వాణిజ్య వాహనాలకు ఉపయోగకరంగా ఉంటుంది అంటున్నారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితో పాటుగా ఆ చుట్టుపక్కల భూముల్లో ధరల పెరిగాయం టున్నారు. ఈ హైవేతో విశాఖపట్నంలో రెండు పోర్టులతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్గో కార్యకలాపాలకు వీలవుతుంది అంటున్నా రు. రెండు పొరుగు రాష్ట్రాలతో పాటు విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధికి దోహద పడుతుందని చెబుతున్నారు. ఈ హైవే పనులు త్వరలోనే పూర్తవుతా యని.. త్వరలోనే రాకపోకలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

## రాజకీయాలకు దూరంగా ఆర్కే...!



**గుంటూరు,తెలంగాణ దిశ:** మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గత కొద్ది రోజులుగా యాక్టివ్‌గా కనిపించడం లేదు. ఆయన కొన్ని నెలల నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. పూర్తిగా వ్యవసాయానికే పరిమితం అయినట్లు తెలిసింది. ఆంధ్రప్ర దేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన సైలెంట్ అయినట్లు తెలిసింది. మంగళగిరి నియోజకవర్గంలోనూ ఆయన కార్యకర్తలను కలవడం లేదు. చంద్రబాబు నాయుడుపై న్యాయస్థానాలకు వెళ్లడంతో పాటు అనేక కేసులు వేయడంతో తనకు ఈ పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి ఆళ్ల రామకృష్ణారెడ్డి మౌనాన్నే ఆశ్రయించినట్లు కనపడుతుంది. వైసీపీ అధినేత జగను వచ్చి కలిసిన సందర్భం కూడా లేకపోవడం విశేషం. ఆళ్ల రామకృష్ణారెడ్డి వరసగా రెండుసార్లు మంగళగిరి నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో ఆయన వైసీపీ నుంచి గెలిచారు. 2019 ఎన్నికల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై విజయంసాధించారు. అయితే మంత్రివర్గం లో వైఎస్ జగన్ కు ఆయన చోటు కల్పించలేదు. ఎన్నికల ప్రచారంలో నాడు మంత్రి పదవి ఇస్తామనని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని వదిలేశారు. మంత్రి పదవిదక్కలేదన్న అసంతృప్తితో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆళ్ల రామకృష్ణారెడ్డిని పక్కన పెట్టి మంగళగిరి టిక్కెట్ ను చిరంజీవికి ఇచ్చారు. దీంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి తన ఎమ్మెల్యే పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగన్ ను కూడా నాడు కలిసేందుకు ఇష్టపడలేదు. ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్ షర్మిల ఏపీ కాంగ్రెస్ చీఫ్‌గా నియమితులు కావడంతో ఆమె వెంట నడవాలని భావించి కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. కానీ తర్వాత మళ్లీ కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి తిరిగి వైసీపీ లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు జగన్ కూడా ఆళ్ల రామకృష్ణారెడ్డిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం తరుపునే కాకుండా, పార్టీ విషయాలపై బలమైన గొంతుకగా ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో మంగళగిరి నుంచి నారా లోకేశ్ విజయం సాధించడంతో పాటు వరసగా వైసీపీ నేతలపై కేసులు నమోదవుతుం డటంతో ఆయన కొంత డైలమాలో పడినట్లు సమాచారం. వైసీపీలో మరొక చర్చ జరుగుతుంది. ఆయనకు మంగళగిరి సీటు కాకుండా ఈసారి సత్తెనపల్లి సీటును ఇచ్చేందుకు జగన్ సిద్ధమయినట్లు వార్తలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగిరిని వదిలి పెట్టి వెళ్లేందుకు ఇష్టపడటం లేదని తెలిసింది. తాను ఓటమి చెందిన మంగళగిరి నుంచే మళ్లీ పోటీ చేయాలని ఆళ్ల రామకృష్ణారెడ్డి భావిస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆ రకమైన హామీ జగన్ నుంచి లభిస్తే తిరిగి ఆళ్ల రామకృష్ణారెడ్డి యాక్టివ్ అవ్వాలని చూస్తున్నారట. అయితే జగన్ దీనిపై ఇంత వరకూ క్లారిటీ ఇవ్వకపోవడంతోనే ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజకీయంగా సైలెంట్ గా ఉన్నారని చెబుతున్నారు.

## ఖజానా నిల్.. బిల్లులు ఫుల్?

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు వ్యవహారంపై ఆర్థిక శాఖతో తలెత్తిన వివాదం నేపథ్యంలో పలు అంశాలు తెరపైకి వచ్చాయి. బిల్లుల చెల్లింపుపై ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్ విధానం అమలు చేయాలని కాంట్రాక్టర్లు మొదట్నుంచి డిమాండ్ చేస్తున్నారు. సీఎఫ్ఎంఎస్ విధానంలో అమలు చేస్తున్న విధానాల్లో లోపాలను కాంట్రాక్టర్లు ఎత్తి చూపుతుంటే తమ చేతుల్లో ఏముందని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దాదాపు 7వేల మంది కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.3వేల కోట్ల రుపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మార్చి నెలాఖరులోగా బ్యాంకు రుణాలను రీ షెడ్యూల్ చేయడం కోసం బకాయిల్లో కొంత మేరకు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ఏపీలో కాంట్రాక్టర్లు చేపట్టిన హై ఇంపాక్ట్ పనులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ పనులు, పోలవరం పునరావాస కాలనీల నిర్మాణం, పీహెచ్‌సీల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, కాల్వల మరమ్మతులు ఉ న్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, హౌసింగ్, డ్రైనేజీ వంటి పనులు కూడా చేశారు. గత ఐదేళ్లలో చేపట్టిన పనులతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9 నెలలుగా చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు కూడా భారీగా బకాయి పడ్డారు. నియోజక వర్గాల్లో అత్యవసరం చేపట్టాల్సిన పనుల్ని స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులతో ఆగమేఘాలపై పనులు అప్పగించి పూర్తి చేయించారు. బిల్లుల చెల్లింపు వ్యవహారంలో గత ఐదేళ్లుగా కొత్త పద్ధతులు మొదలయ్యాయి. ముందు పూర్తి చేసిన పనులకు ముందుగా చెల్లించే విధానానికి తిలోదకాలు ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే పద్ధతి అనుసరిస్తున్నారు. బడా కాంట్రాక్టు సంస్థలకు మాత్రమే చెల్లింపులు చేస్తూ చిన్నాచితక కాంట్రాక్టర్లను వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉ న్నాయి. ఎల్వోసిల నుంచి చెల్లింపుల వరకు కొందరికే ప్రాధాన్యత ఇవ్వడంపై కాంట్రాక్టర్లలో అసహనం నెలకొంది. ఈ క్రమంలో రాయలసీమలోని చిత్తూరు, కడప, పులివెందులలో చేసిన పనులకు బిల్లులు చెల్లించడం వెలుగు చూసింది. అయా ప్రాంతాల్లో చేపట్టిన పనుల్ని క్యాపిటల్ హెడ్స్ నుంచి నిధులు కేటాయించడంతో ప్రభుత్వం మారినా వాటికి నిధుల కొరత లేకుండా చెల్లింపులు జరిగిపోయినట్టు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆర్థిక శాఖ బాధ్యులు సూచించిన వారికి మాత్రమే చెల్లింపులు జరిగాయని, గత ప్రభుత్వంలో నష్టపోయినట్టే ఇప్పుడు కూడా చిన్న కాంట్రాక్టర్లు రోడ్డున పడుతున్నారని చెబుతున్నారు. కాంట్రాక్టర్లకు ఏప్రిల్ వరకు బిల్లులు చెల్లించలేమని ఆర్థిక శాఖ అధికారులు తేల్చి చెప్పడం కాంట్రాక్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది.

అధికారుల వాదన మాత్రం మరోలా ఉంది. బిల్లుల చెల్లింపు ప్రాధాన్యతలు ప్రభుత్వమే నిర్ణయిస్తుందని ఇందులో ఆర్థిక శాఖ పాత్ర నామమాత్రంగా ఉందని చెబుతున్నారు. బిల్లుల చెల్లింపు కోరుతూ ఆర్థిక శాఖకు కాంట్రాక్టర్లు వచ్చినపుడు కూడా ప్రభుత్వ పెద్దలను సంప్రదించాలని సెక్రటరీ సూచించినట్టు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక స్థితి బిల్లులకు చెల్లింపుకు అనువుగా లేదని, ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు, తప్పనిసరిగా అమలు చేయాల్సిన పథకాలకు అతి కష్టమ్మీద నిధులు సమీకరిస్తున్నట్టు వివరించినట్టు చెబుతున్నారు. కాంట్రాక్టర్ల సమస్యపై అధికారులకు సానుభూతి ఉన్నా ఖజానా ఉన్న పరిస్థితుల్లో చెల్లింపులపై సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదని ఏపీ ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. కొందరికే చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణల్ని కూడా ఆర్థిక శాక వర్గాలు తోసిపుచ్చాయి. ప్రాధాన్యత క్రమంలో అందరికి పెండింగ్ బిల్లుల్ని క్లియర్ చేస్తున్నట్టు చెప్పారు. 2014–19 మధ్య కాలంలో పెండింగ్ ఉన్న బిల్లుల్ని ఇప్పుడు క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. బిల్లులు ఎవరికి చెల్లించాలనే నిర్ణయం అధికారుల వద్ద ఉండదనే సంగతి కాంట్రాక్టర్లకు కూడా తెలుసని, ప్రభుత్వంతోనే ఈ వ్యవహారాన్ని తేల్చుకోవాలని సూచిస్తున్నారు.

## అందరిని దూరం చేసుకుంటున్నారే..!

**ఒంగోలు,తెలంగాణ దిశ:** వైసీపీఅధినేత వైఎస్ జగన్ కు దగ్గర వాళ్లంతా దూరమవు తున్నారు. నా అనే వాళ్లు ఎవరూ ఆయన వద్ద ఉండకుండా పోతున్నారు. అయిన వాళ్లే శత్రువులుగా మారుతున్నారు. జగన్ కు అధికార పక్షం కంటే ఇప్పుడు స్వపక్షమే పెద్ద ఇబ్బందిగా మారింది. అసలు ఎందుకీ పరిస్థితి? జగన్‌లో లోపమా? లేక పక్కన ఉన్న వాళ్లు పక్కదోవ పట్టిస్తున్నా రా? ఐఏఎస్ లు కావచ్చు.. సొంత మనుషులు కావచ్చు. ఎవరైనా చెప్పిన మాటలను విని తనను కష్టకాలంలో ఆదుకున్న వారిని దూరం చేసుకుంటే ఎవరికి నష్టమన్నది జగన్ ఆలోచిస్తున్నారా? లేదా? అని అనిపిస్తుంది. ఎందుకంటే 2019 ఎన్నికల తర్వాత నుంచే ఈ రకమైన పరిస్థితిని జగన్ ఎదుర్కొంటున్నారు. సాధారణంగా రాజకీయ నేతలు కుటుంబ సభ్యులపై ఆధారపడతారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని ప్రయత్నిస్తారు. వారికి పదవులు ఇచ్చో.. మరొక రూపంలో సాయం అందించో.. తనకు వ్యతిరేకంగా మారకుండా చేసుకుంటారు. చంద్రబాబు నాయుడును చూసైనా నేర్చుకోకపోతే ఎట్లా? ఎన్టీఆర్ ను దించేసి పార్టీని చేతుల్లోకి తీసుకున్నప్పటికీ నందమూరి కుటుంబాన్ని ఆయన దూరం చేసుకోలేదు. ఒక్క దగ్గుబాటి కుటుంబంతో మాత్రమే నిన్నటి వరకూ కొంత పొరపచ్చాలుండేవి. అవి కూడా మొన్నటితో మాసిపోయాయి. ఎన్టీఆర్ వారసులెవరు తన రాజకీయాలలకు అడ్డుపడకుండా వారిని చూసుకోగలిగారు. ఇక తన సొంత కుటుంబంలో కూడా చంద్రబాబు ఎప్పుడూ విభేదాలు పెట్టుకోలేదు. చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు కొంతకాలం విభేదించినా తర్వాత మళ్లీ అన్న పంచన చేరిపోయారు. కానీ జగన్ అధికారంలోకి రాగానే చెల్లి వైఎస్ షర్మిలను దూరం చేసుకున్నారు. తర్వాత తల్లికి దూరమయ్యారు. చివరకు చెల్లి, తల్లిపైన న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక అధికారం కోల్పోయిన తర్వాత తన దగ్గర బంధువు అయిన బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా పార్టీని వీడి వెళ్లారు. జగన్ వైఖరి నచ్చకే ఆయన పార్టీని వదిలి తన ప్రత్యర్థి పంచన చేరారు. ఇక తాజాగా విజయసాయిరెడ్డి కూడా దూరమయ్యారు. విజయసాయిరెడ్డి బంధువు కాకపోయిన దగ్గర బంధువు కింద లెక్కే. ఎందుకంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఆయన కుటుంబానికి ఆడిటర్ గా ఉన్న విజయసాయిరెడ్డి తర్వాత క్రమంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత జగన్ పైనే ఉ ంది. విజయసాయిరెడ్డి ఏదైనా పొరపాటు చేసినా పిలిచి మందలించే స్వేచ్ఛ కూడా జగన్ కు ఉంది. కానీ ఆ రెండూ కాదని సాయిరెడ్డి తనంతట తానే దూరమయ్యేలా జగన్ చేసుకున్నారంటే జగన్ కు బంధువుల పొడగిట్టదన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

జనంలోకి కూడా ఈ ఘటనలు తప్పుడు ప్రచారానికి వెళతాయి. జనం కూడా అదినమ్మి జగన్ కు వ్యతిరేకమయ్యే అవకాశముంది. అదే సమయంలో దగ్గర బంధువులే దూరమయి ఆరోపణలు చేస్తుంటే చూసే వారికి నిజం అనిపించక మానదు. జగన్‌ది స్వయంకృతాపరాధ మేననిచెప్పాలి. ఇందులో ఎవరి తప్పిదం లేదు...

### గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**– బీసి గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ మణి దీప్తి**

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** గురుకులాల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని బీసి గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ మణి దీప్తి సోమవారం ప్రకటించారు. మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడిచే బీసీ బాలికల బాలుర పాఠశాలల్లో 2025–26విదాసంవత్సరానికి గాను 6,7,8,9 ఇంగ్లీష్ మీడియం తరగ తులలో ఖాళీ సీట్లలో ప్రవేశం కొరకు ఆహ్వానించి నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 31 లోపు కుల సర్టిఫికెట్ ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న ఉంటుందని, మరిన్ని వివరాలకు పరిశీలించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పిడిఎస్ బియ్యం లారీ పట్టుకున్న పోలీసులు




**అశ్వాపురం,తెలంగాణ దిశ:** మణుగూరు నుండి పాల్వంచ వైపు తరలిస్తున్న రేషన్ బియ్యం లారిని అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ ఎదుట పట్టుకున్నారు. అయితే పినపాక, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో గత కొన్ని నెలలుగా నడుస్తున్న ఈ రేషన్ దందాలో ఆయా మండలాల సివిల్ సప్లై అధికారుల కనుసన్నల్లో నడుస్తోందని , రైస్ మిల్లర్ల కమీషన్ కు కక్కుర్తి పడి , వారి దందాకు అధికారులే కొమ్ముకాస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కరకగూడెం మండలంలో సొంతానికి రెండు క్వింటాళ్ల బియ్యం తెచ్చుకుంటున్న ఓ ఆటో డ్రైవర్ పై కేసు పెట్టిన సంబంధిత అధికారులు, దుగునేపల్లీ లో ఓ వ్యక్తి వద్ద నిల్వ చేసిన సుమారు 100 క్వింటాళ్ల బియ్యం ను సీజ్ చేయక పోగా, సదరు అధికారి భారీ మొత్తంలో అమ్యమ్యాలు తీసుకుని కేసు లేకుండానే వ్యవహారం నడిపినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయ్యా సివిల్ సప్లై అధికారుల్లారా.. మీ ప్రమేయం లేకుండానే ఇంత జరుగుతుందా అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.? ఇక్కడ “పెద్దోడికి ఒక న్యాయం – పేదోడికి ఒక న్యాయమా “ అని ప్రజలు నిలదీస్తున్నారు. కొసమెరుపు ఏంటంటే కేసుల టార్గెట్ కోసం సైకిళ్ళు ఆటోల్లో తిరిగి సొంతానికి కొనుక్కునే వారిని కేసుల్లో ఇరికిస్తున్న ఆ శాఖ అధికారి..నిజాయితీ నిమ్మకాయ అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతు న్నాడని, కొందరు బియ్యం కొనుక్కొని ఆయన చేత కేసుల్లో ఇరికించ బడ్డ బాధితులు వాపోతున్నారు. ఇకనైనా ఇటువంటి రేషన్ దందా చేస్తున్న వారిపై, వారికి సహకరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అన్నీ తానై.. వాసం శెట్టి...



**కాకినాడ,తెలంగాణ దిశ:**పార్టీలో చేరినకేవలం నెల రోజుల వ్యవధి లోనే ఎమ్మెల్యే టిక్కెట్టు దక్కించుకుని, ఎన్నికల్లో గెలిచారు. ఎవ్వరూ ఊహించని విధంగా మంత్రి పదవిని దక్కించుకున్న అదృష్టవంతుని గా ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేరు మార్మోగిపోయింది.. అయితే ఎంత తక్కువ వ్యవధిలో ఓ మంత్రి స్థాయి వరకు ఎదిగారో.. అంతే తక్కువ సమయంలో ఆయన పనితీరుపై విమర్శలు ఎదుర్కొ న్నారు. పార్టీ అంతర్గత మీటింగ్‌లో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేసిన ఆడియో బయటకు వచ్చి సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.ఆ తరువాత అసెంబ్లీకి ఆలస్యంగా వస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా వ్యాఖ్యానించడం.. ఇలా వరుసగా ఎదురైన చేదు అనుభవాలు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఒకింత ఇబ్బందికి గురిచేశాయి. అయితే రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పుడు ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం చర్యల ద్వారా వాసంశెట్టి సుభాష్ ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఆయన తండ్రి వాసంశెట్టి సత్యంనియోజకవర్గంలో అంతా తానై వ్యవహరిస్తున్నారని.. మరోవైపు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని సైతం పక్కన పెడుతున్నారని క్యాడర్ లో వినిపిస్తోంది.రామచంద్రపురంలో ఒకప్పటి టీడీపీ క్యాడర్ అంతా అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రధానంగా మంత్రి సుభాష్ తండ్రి సత్యం చర్యలే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో సుభాష్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారిని పనిగట్టుకుని పక్కన పెట్టి ఎందులోనూ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నది మరో ఆరోపణ. ఇదిలా ఉంటే పార్టీ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అంతా మంత్రి సుభాష్ తండ్రి సత్యం పేరునే జపం చేయడం.. ప్రతీ అభివృద్ధి పనుల విషయంలోనూ ఆయన పేరు పనిగట్టుకుని చెప్పించుకోవడం ఇక్కడ అసలు ఎమ్మెల్యే సుభాష్‌నా లేక ఆయన తండ్రి సత్యంనా అన్నంతగా సామాన్య ప్రజలు కన్ఫ్యూజ్ అవుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఇంకా విచిత్రం ఏంటంటే మంత్రి సుభాష్ నియోజకవర్గంలో లేకపోయినా అన్నీ తానై మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం కానిచ్చేయడం, దానికి అధికారులు సైతం హాజరు అవ్వడం, ఆపై పబ్లిక్ రిలేషన్స్‌శాఖ అధికారులు సైతం ఆయన పేరుమీదే ప్రెస్‌నోట్ రిలీజ్ చేయడం కనిపిస్తోందని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు..

మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం ఎలాంటి రాజకీయ పదవిలో లేరు. మంత్రికి తండ్రి కావడంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. అదే పేరుతోనే నియోజకవర్గంలో అంతా చక్రం తిప్పుతున్నారని, వాసంశెట్టి సుభాష్ విజయం కోసం పనిచేసిన వారినిసైతం పట్టించుకోవడం లేదని క్యాడర్‌అసంతృప్తిగా ఉంది.

రామచ ంద్రపురం నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ కంటే ఆయన తండ్రి సత్యం పేరే ప్రముఖంగా వినిపించింది. స్థానికంగా ఏమైనా ప్రకటనలు వచ్చినా వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ పేరుతోనే వెలువడు తున్నాయి. చాలా కార్యక్రమాల్లో మంత్రి సుభాష్ కంటే ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం పేరు ఎక్కువగా వినిపిస్తోందని చెబుతున్నారు. అన్నీ తానై తండ్రి నడిపిస్తున్నా.. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏం చేస్తున్నారని పార్టీ శ్రేణులు గుర్రుగా ఉన్నాయని తెలుస్తోంది.

# మూడో సంతానం, ఆవు దూడ ఆర్థిక సాయం

## విజయనగరం ఎంపీ సంచలన నిర్ణయం

**విజయనగరం,తెలంగాణ దిశ:** విజయనగరం ఎంపీకలిశెట్టి అప్పలనాయుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జనాభా పెరుగుదల కోసం అందరూ ప్రయత్నించాలని, ఎక్కువమంది పిల్లల్ని కనాలని పిలుపునిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ఎంపి కలిశెట్టి ఆదిశగా ప్రజలను ప్రోత్సహించేందుకు అడుగులు వేశారు. మూడవ బిడ్డకు జన్మనిచ్చిన మహిళలకు ప్రోత్సాహకాలను అందించనున్నట్లు తెలిపారు. తన విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఎవరైనా మూడో బిడ్డకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు కల్పిస్తానని ప్రకటించారు. మూడో బిడ్డ.. ఆడపిల్ల అయితే 50వేలు ఇస్తానని, మగ బిడ్డ పుడితే ఆవు, దూడ ఇస్తానని ప్రకటించారు.తనకు ప్రతినెల 3 లక్షల వరకు జీతభత్యాలు వస్తాయని ఆ మొత్తం నగదు ఈ తరహా ప్రోత్సాకానికే ఇస్తానని తెలియజేశారు. ఇది కేవలం తాను ఎంపీ పదవి ఉన్నంత వరకే కాదని శాశ్వతంగా కొనసాగిస్తానని అన్నారు. ఎంపీ కలిశెట్టి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు జిల్లా వాసులు. తన తల్లి నేర్పిన సంస్కారంతో ప్రజలకు సేవ చేస్తున్నాని, తనకు ఆరుగురు అక్కచెల్లెళ్లు, ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. తన కుటుంబంలో ఇంత మంది మహిళలు ఉండటం తనకు ఎంతోఆనందాన్ని కలిగిస్తుందని, వారు తన పట్ల చూపిస్తున్న ప్రేమాభిమా నాల వల్లే మహిళల కోసం ప్రత్యేకంగా ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు.తొలిసారి ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పల నాయుడు అనేక వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారు. ఢిల్లీలో తన క్వార్టర్స్ నుంచి పార్లమెంట్ వరకు సైకిల్‌పై ప్రయాణం చేసి అందరి దృష్టి ఆకర్షించారు. డిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యము తగ్గించాలంటే అందరూ సైకిళ్లు లేదా కాలుష్యం విడుదల కాని విధానాలను వినియోగించాలని కోరారు. అంతే కాకుండా తెలుగు భాష పరిరక్షణ కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల ప్రయాగరాజ్‌లో జరిగిన మహ కుంభమేళాలో తెలుగు వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌ను కోరి తెలుగువారి సౌకర్యాల కోసం కృషి చేశారు. ఇప్పటివరకు డిల్లీలో జరిగిన పార్లమెంట్ సమావేశాలకు ఒక్క రోజు కూడా గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా అన్ని సమావేశాలకు హాజరై పూర్తిస్థాయి హాజరు కనబరిచిన ఎంపీగా రికార్డ్ సృష్టించారు. ఇలా అనేక వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

# భారీగా కల్తీ నిత్యవసర వస్తువుల పట్టివేత




**శంషాబాద్,తెలంగాణ దిశ:** నకిలీ కిరాణా వస్తువుల తయారీ కేంద్రంపై ఎస్ఓటీ పోలీసుల దాడులు నిర్వహించారు. పక్క సమాచారంతో రాజేంద్రనగర్ జోన్ ఎస్వోటీ పోలీసుల బృందం ఒక్కసారిగా దాడులు నిర్వహించి, నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 8 లక్షల విలువ చేసే నకిలీ కిరాణా వస్తువులు స్వాధీనం చేసుకున్న ఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుబన్ కాలనీలో చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ ఎస్ఓటి సిఐ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మధుబన్ కాలనీలో నకిలీ కిరాణా వస్తువులు తయారు చేస్తున్నారని పక్క సమాచారం వచ్చింది. దీంతో ఎస్వోటీ పోలీసులతోపాటు మైలార్దేవుపల్లి పోలీసుల బృందం ఒక్కసారిగా నకిలీ తయారీ కేంద్రంపై దాడుల నిర్వహించామని తెలిపారు. ఈ దాడులలో ఘనోబా, ఖుషి,రీత,మనీషా నలుగురు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని ,మరో వ్యక్తి వీరేంద్ర గహ్లాట్ పరారీలో ఉన్నాడని తెలిపారు. వీరి వద్ద నుంచి నకిలీ బ్రూక్ బ్యాండ్ రెడ్ లేబుల్ టీ పౌడర్, తాజ్ మహల్ టీ పౌడర్, వీల్ సర్ఫ్, ప్యారెట్ కొబ్బరినూనె, కంఫర్ట్ కండిషనర్, క్లీనిక్ ప్లస్ హెయిర్ షాంపూ, కార్న పౌడర్, బాడీ లోషన్ లాంటి 20 రకాల కిరణా వస్తువులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొత్తం వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న వాటి విలువ 8 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. నిందితులను మైలార్దేవుపల్లి పోలీసులకు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. మైలార్దేవుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో వివిధ రకాల 19 ఆపరేషన్లు



**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో గత 24 గంటలలో వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో వివిధ రకాల 19 ఆపరేషన్లు జరిగాయి. ఇందులో 11 మంది గర్భిణీలు డెలివరీలు అయ్యారు. ఇందులో ఆరుగురు ఆపరేషన్లు ఐదుగురు సాధారణ కాన్పులు జరగడం అయినది. ఇద్దరికీ గర్భసంచికి సంబంధించిన వ్యాధుల వల్ల గర్భసంచినీ తొలగించడం జరిగినది. ముగ్గురికి కంటి ఆపరేషన్లు, ఇంకో నలుగురికి జనరల్ సర్జరీలు చేయడం జరిగినది. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టుల సేవలు అందుబాటులో ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఇట్టి అవకాశాలను సద్వినియోగ పర్చుకోవాలని ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పెంచలయ్య తెలియజేశారు. ఆసుపత్రిలో రేడియాలజీ విభాగంలో ఎక్స్రేలు, స్కానింగ్, ఈసీజీ చేస్తున్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల విభాగానికి సంబంధించిన ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. గైనకాలజీ భాగంలో ముగ్గురు మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రొఫెసర్లు తమ సేవలను అందిస్తున్నారు. జనరల్ సర్జరీలో ఇద్దరు వైద్యులు ఆపరేషన్లు 24 గంటలు చేస్తున్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ అనిల్ 24 గంటలు అందుబాటులో ఉండి అన్ని రకాల ఆపరేషన్లు చేస్తున్నారు. మోకాలి మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వాళ్ళు డాక్టర్ అనిల్ ని సంప్రదించగలరు. జనరల్ ఫిజీషియన్ విభాగంలో ఇద్దరు డాక్టర్లు తమ సేవలను 24 గంటలు అందిస్తున్నారు. కంటి విభాగంలో డాక్టర్ రత్నమాల తమ సేవలను అందించుచున్నారు. రేడియాలజీ విభాగంలో సీనియర్ వైద్యులు డాక్టర్ రవీందర్ అవసరమైన రోగులకి స్కానింగ్ చేయుచున్నారు. వేములవాడ పరిసర ప్రాంత ప్రజలు ఎటువంటి మన ఆరోగ్యం గురైన వాళ్లు ప్రాంతి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్యను కలిసి వైద్య సేవలు ఉచితంగా పొందాలని తెలియజేస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకి ఎటువంటి అసౌకర్యం కలిగిన సూపరిండెంట్నీ సంప్రదించి తమ సమస్యలు పరిష్కరించుకోగలరని విజ్ఞప్తి చేస్తున్నాము.

# ఇక కొడాలి నాని వంతు..




విజయవాడ, ,: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్కటే చర్చ. అదే కొడాలి నాని అరెస్ట్ ఎప్పుడు. అటు టీడీపీ క్యాడర్‌లో..ఇటు ప్రజల్లో ఇదే హాట్ టాపిక్‌గా కొనసాగుతూ వచ్చింది. ఇదే రోలో వల్లభనేని వంశీ పేరు కూడా వినిపించేది. కట్ చేస్తే 15 రోజుల కిందే ఆయన అరెస్ట్ అయ్యారు. విజయవాడ సబ్ జైలులో ఉన్నారు.పది రోజుల క్రితం పోసాని కృష్ణమురళిని కూడా హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు ఏపీ పోలీసులు. ఆ తర్వాత పలు కేసుల విషయంలో ఆయనను వరుస పెట్టి విచారణ చేస్తున్నారు. ఇక ఇప్పుడు కొడాలి నాని వంతు వచ్చిందంటున్నారు టీడీపీ క్యాడర్. కానీ ఆయన అరెస్ట్ ఎప్పుడంటూ సోషల్ మీడియాలో పోస్టులతో హోరెత్తిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చాలా మంది నేతలు నోటికి ఎంతొస్తే అంత మాట్లాడారని గుర్తు చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. ఇప్పుడు కూటమి పవర్‌లో ఉండటం..పలువురి నేతలను అరెస్ట్ చేయడంతో ఎందుకొచ్చిన తంటా అని నోరు మెదపడం లేదు నేతలు. అయితే ఇప్పుడు సైలెంట్‌గా ఉంటున్నప్పటికీ..వైసీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన వారిని అసలు వదిలిపెట్టొదని టీడీపీ క్యాడర్ అధిష్టానం మీద ప్రెజర్ పెడుతోంది. దీంతో అన్ని వివరాలు రెడ్ బుక్‌లో ఉన్నాయి. దాని ప్రకారం అంతా జరిగిపోతుందని చెబుతున్నారట టీడీపీ పెద్దలు.ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ జైలులో ఉన్నారు. ఆయన మీద బలమైన సెక్షన్లతో కేసులు పెట్టారు. బెయిల్ రావడానికి చాలా సమయం పడుతుంది. ఇక పోసాని కృష్ణమురళి విషయంలోనూ ఇలాగే ఉంది. ఆయనను ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లకు తిప్పుతున్నారు. కేసులు కూడా లెక్కకు మిక్కిలి ఉన్నాయి. ఇక ఈ ఇద్దరి తర్వాత ఎవరూ అంటే వైసీపీలో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న మరో నేత పేరు కీలకంగా వినిపిస్తోంది. టీడీపీ కార్యకర్తల వేళ్లన్నీ మాజీ మంత్రి కొడాలి నాని వైపే చూపిస్తున్నాయి.అసలు ఆయన ఎక్కడ ఉన్నారో కూడా ఎవరికీ తెలియడం లేదంటున్నారు. కొడాలి నాని ఈ మధ్య వంశీని అరెస్టు చేసినప్పుడు జగన్ ములాఖత్‌కు వెళ్తే ఆయనతో పాటు కనిపించారు. ఇప్పుడు ఆయన మీద కూడా కేసులు పెట్టడానికి సిద్ధం అవుతోందని అంటున్నారు. నాని కూడా ఒకటి కాకపోతే ఎన్ని కేసులైనా పెట్టుకోనివ్వండి అంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు.అయితే బయటికి గంభీరంగా ఉన్నప్పటికీ..కొడాలి నానిని కూడా అరెస్ట్ భయం వెంటాడుతోందట. నెక్ట్స్ అరెస్ట్ తనదేనని ఆయన మానసికంగా సిద్ధమై ఉన్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఏదైతే గదైందని ఆయన వాయిస్‌లో బేస్ పెంచారని అంటున్నారు.కొడాలి నానిని రెండు రకాలు రౌండప్ చేస్తారన్న టాక్ వినిపిస్తోంది. అవినీతి కేసులతో పాటు చంద్రబాబు, అనుచిత వ్యాఖ్యలు చేశారన్న దాని మీదనే కేసులు పెడతారన్న టాక్ వినిపిస్తోంది. పోసాని కేసుల మాదిరిగానే అని అంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ కుటుంబాన్ని వ్యక్తిగతంగా తిట్టారని విశాఖ త్రీ టౌన్ పీఎస్‌లో కొడాలి నాని మీద ఇప్పటికే కేసు నమోదు అయింది.ఆ కేసు లింకుతో ఒక దాని తర్వాత ఒకటి అన్నట్లుగా పీటీ వారెంట్లు ఇస్తూ పోతే నాని కూడా ఇబ్బందులు ఫేస్ చేయకతప్పదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ మీద హాట్ కామెంట్స్ చేశారు కొడాలి నాని. దాంతో కొడాలి మీద చర్యలకు టీడీపీ క్యాడర్ పట్టుబడుతుందట. అయితే సమయం చూసి నానిని కూడా అరెస్ట్ చేస్తారన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది. చూడాలి మరి రాబోయే రోజుల్లో ఏం జరగబోతుందో..

# వారసుల కోసం ఆరాటం

వరంగల్, ,: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, జనగామ డీసీసీ పీఠంపై ఎవరికి దక్కుతుందనేది హాట్ టాపిక్‌గా మారింది. ములుగు జిల్లా అధ్యక్ష పదవి రేసులో మంత్రి సీతక్క కుమారుడు సూర్య, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్ష రేసులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీ రెడ్డి ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్త ఝాన్సీరెడ్డికి ఎలాంటి పదవి లేకపోవడంతో నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య వస్తుందట.ములుగు జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం పైడాకుల అశోక్ ఉన్నారు. ఆయన జడ్పీ చైర్మన్ కుర్చీలో కూర్చోవాలని తెగ ఆరాట పడుతున్నాడట. మంత్రి సీతక్కకు కూడా తన మదిలో మాట చెప్పేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా అధ్యక్ష పగ్గాలు సీతక్క కుమారుడు సూర్యకు ఇస్తారనే చర్చ జరుగుతుంది. ఇక జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ప్రస్తుతం కొమ్మూరి ప్రతాపరెడ్డి కొనసాగుతున్నారు. వరస వైఫల్యాలు, పార్టీలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో అక్కడ బలమైన నేతకు డీసీసీ పగ్గాలు ఇవ్వాలని అధినాయకత్వం భావిస్తుందట.హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం..వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. 2010 నుంచి 14 సంవత్సరాల పాటు కంటిన్యూగా డీసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఈ సారి పార్టీ పగ్గాలు వేరే వాళ్ల చేతిలో పెట్టాలని నాయిని కోరుతున్నారట. పనిలో పనిగా తన మదిలో ఉన్న రెండు పేర్లను అధిష్టానం పెద్దల చెవిలో వేశారట. ఇక వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ కొనసాగుతున్నారు. మంత్రి కొండా సురేఖతో సఖ్యత లేకపోవడంతో ఎర్రబెల్లి స్వర్ణను స్థానంలో మరొకరిని నియమిస్తారని టాక్ వినిపిస్తోంది.జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీసీసీ ప్రెసిడెంట్‌గా ప్రకాష్ రెడ్డి ఉన్నారు. ఆయన ఇప్పుడు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. దీంతో అతడి స్థానంలో కొత్తవ్యక్తిని డీసీసీ అధ్యక్షుడి కుర్చీలో కూర్చోబెట్టాలని పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లుగా చర్చ జరుగుతుంది.మార్పు కచ్చితంగా ఉంటుందని భావిస్తున్న నేపథ్యంలో మంత్రి శ్రీధర్ బాబు ఇక్కడ నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుతం భరత్ చంద్రారెడ్డి కొనసాగుతున్నారు. ఈయన స్థానంలో కొత్త వ్యక్తికి అవకాశం కల్పిస్తారనే చర్చ జరుగుతోంది. ఇక్కడ సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డితో పాటు, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఓం మురళీనాయక్ నిర్ణయం కీలకం కానుంది.నామినేటెడ్ పదవులపై నేతల ఆశలు సన్నగిల్లుతున్నాయట. అందుకే కనీసం పార్టీ పదవులతోనైనా సర్దిపెట్టుకోవాలని భావిస్తున్నారట. ముఖ్యంగా డీసీసీ పీఠంపైనే ఎక్కువ మంది దృష్టి పెట్టినట్లుగా తెలుస్తుంది. ఓరుగల్లు కాంగ్రెస్ నేతల వారసులు, అనుచరుల ఆశలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి మరి.

# రైతులకు కన్నీరు తెప్పిస్తున్న పుదీనా!



పుదీనా... మనం వండే ప్రతి వంటలో వాడుతుంటాం. సూపర్ మార్కెట్కు వెళ్తే ఒక్కో కట్ట రూ.10కి అమ్ముతుంటారు. చిరు వ్యాపారుల దగ్గరికి వెళ్లినా రూ.5 కి తక్కువ ఉండదు. కానీ, రైతులకు మాత్రంకట్టకు ఒక్క రూపాయి కూడా రావడం లేదు.పోనీ నిల్వ చేసుకొని తర్వాత అయినా అమ్ముకుం దామనుంచే ప్రభుత్వాలు అలాంటి ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో ధర తగ్గినప్పుడల్లా మార్కెట్లోనే పారబోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫలితంగా కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కోల్ స్టోరేజీలు ఏర్పాటు చేసి ధర ఉన్నప్పుడు అమ్ముకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. మరిన్ని రైతులు బజార్లు, పుదీనా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినా కొంత మేర మేలు జరుగుతుందని అంటున్నారు. పుదీనా పంట ఎకరం, అరెకరం ఉన్న రైతులు కూడా సాగు చేసుకోవచ్చు. కానీ, అడుగు మందులు,పిచికారీ మందుల ధరలు, కూలీ రేట్లు విపరీతంగా పెరిగిపోవడంతో గిట్టుబాటు కావడం లేదు. పంట కాలం 45 రోజుల నుంచి 60 రోజులే అయినప్పటికీ... ఒక ఎకరానికి సహజ ఎరువులు (పశువుల పేడ, పౌల్ట్రీ ఎరువు) తో పాటు యూరియా, డీఏపీ లాంటి మందులు వేయాల్సి ఉంటుంది. పంటకు దోమ, పచ్చ పురుగు, నల్ల పురుగు, ఆకు తెగులు, పేను బంక తదితర రోగాలు వస్తుంటాయి.వీటి నివారణకు క్యాబ్రి యో టాప్, అక్టోబట్, ర్యాపిడ్, బెంజర్, ప్రోక్లెయిమ్, అమిస్టార్, పితోరా... తదితర మందులు వాడుతుంటారు. వీటితో పాటు కలుపు, కోత కూలీల ఖర్చులు కలుపుకొని... రూ. 60 వేల నుంచి రూ. 80 వేలవరకు ఖర్చు అవుతోంది. ఈ పంట కోస్తే దాదాపు 80 వేల నుంచి లక్ష కట్టలు వస్తాయి. అంటే మార్కెట్లో మినిమం కట్టకు రూ.1.50 నుంచి రూ.2 పలికితే కొంత లాభం ఉంటుంది. కానీ, ప్రస్తుతం ఒక్కో కట్ట రూ.40 పైసల నుంచి రూ. 60 పైసలు మాత్రమే పలుకుతుంది. ఈ లెక్కన ఒక్క పంటకు (రెండు నెలలు) రూ. 30 వేల వరకు నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.పుదీనా పంటను సాధారణంగా చేవెళ్ల నియోజకవర్గంలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఇందులోనూ చేవెళ్ల మండలం ముడిమ్యాల, మల్కాపూర్, రావుల పల్లి , కుమ్మెర, మొయినాబాద్ మండలం తోలుకట్ట, అప్పారెడ్డి గూడ, నక్కల పల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజూ కనీసం రెండు మినీ వ్యాన్లలో హైదరాబాద్లోని గుడి మల్కాపూర్ మార్కెట్కు తీసుకెళ్తుంటారు. పంట మొత్తం అమ్మితే సరే.. లేదంటే నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో పారబోయాల్సిన పరిస్థితి ఉంటోంది. కోల్ట్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే మరుసటి రోజు అమ్ముకునే చాన్స్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతేకాదు ఈ పంటలు ప్రాంతంలోనే పుదీనా ప్రాసెపింగ్ యూనిట్లు ఏర్పాటు చేయించి.. వారికే అమ్మేలా ఒప్పందం చేయిస్తే మేలు జరుగుతందని అంటున్నారు. దీంతో పాటు నగర శివారులో మరో మార్కెట్ తో పాటు మరిన్ని రైతు బజార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇలా చేస్తే రైతులు నేరుగా వినియోగదారులకు అమ్ముకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

## అకారణంగా కాదు ఆధారాలతో తొలగించారు

**మంథని,తెలంగాణ దిశ:** మంథని మండలంలోని గోపాల్ పూర్ గ్రామ వసుంధర గ్రామైక్య సంఘమునకు చెందిన వి ఓ ఏ ను ఆకారణంగా కాకుండా ఆధారాలతో ఫిర్యాదు చేస్తేనే తొలగించడం జరిగిందని ఆ సంఘం సభ్యులు గణపతి సౌజన్య, లక్కం సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది సంవత్సరాల నుండి పనిచేస్తున్న గొరిగే జయసుధ అనేక అక్రమాలకు పాల్పడుతూ గ్రామంలో అన్ని గ్రూపుల వద్ద డబ్బులు వసూలు చేస్తుందాన్నారు. అంతే కాకుండా గ్రామానికి సంబంధించిన వివో డబ్బులు కట్టిన తర్వాత రసీదులు ఇవ్వకపోవడం లింకేజీ ఏది తీసుకున్న తీసుకున్న వారి దగ్గర డబ్బులు వసూలు చేయడం ఇలాంటి ఎన్నో అక్రమాలకు పాల్పడుతుందని గ్రామ వసుంధర సభ్యుల అందరము కలిసి ఆమెను సీఏ నుండి తొలగించడం జరిగినది.

ఇందులో మంథని ఐకెపి సిబ్బందికి కానీ ఏపీఎం కానీ పెద్దపల్లి డిఆర్డిఓ వాళ్లకు కానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. వసుందర గ్రామైక్య సంఘం సభ్యులు వి ఓ ఏ జయసుధ అనేక వివో మీటింగ్ లలో తీర్మానం లేకుండా ముందుగానే సంతకాలు తీసుకొని ఈ అక్రమాలకు పాల్పడుతుందన్నారు. ఇలాంటి చర్యల వల్లే ఆమెను తొలగించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# రూపాయి.. బెంబేలు



## డాలర్‌తో పోల్చితే 87.31 వద్దకు

ముంబై, : రూపాయికి మరిన్ని చిల్లులుపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, టారిఫ్ అనిశ్చిత పతనం చెందాయి. గ్లోబల్ మార్కెట్లో బ్యారెల్ బ్రెంటాయిల్ స్వల్పంగా పెరిగి 70.56 డాలర్లు పలుకగా, సెన్సెక్స్ 217.41 పాయింట్లు కోల్పోయింది. దీంతో ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు(ఎఫ్ఐఐ)లు రూ. 485.41 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు.

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఇండస్ట్రియల్స్, చమురు అండ్ గ్యాస్ రంగ షేర్లలో చివరి గంటలో భారీగా అమ్మకాలు చోటు చేసుకోవడం సూచీలు నష్టాల్లోకి జారుకోవడానికి ప్రధాన కారణం. వరుసగా ఎనిమిది సెషన్లుగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 217.41 పాయింట్లు పతనం చెంది 74,115.17 వద్ద స్థిరపడింది. ప్రారంభంలో 74,741 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సూచీ ఇంట్రాడేలో 74,022.24 పాయింట్లకు పడిపోయింది. మరో సూచీ నిఫ్టీ సైతం 92.20 పాయింట్లు కోల్పోయి 22,460.30 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు రూ.4 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.4,43,269.25 కోట్లు కరిగిపోయి రూ.3,93, 85,818.73 కోట్లు(4.51 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది.

పరిస్థితులు కొనసాగుతుండటంతోపాటు విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోతుండటంతో దేశీయ కరెన్సీ విలువ ఒకేరోజు 36 పైసలు పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ వారం కనిష్ఠ స్థాయి 87.31కి జారుకున్నది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు పతనం చెందడంతో కరెన్సీ మార్కెట్లో సెంటిమెంట్‌ను నిరాశపరిచిందని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 87.24 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 87.36 కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 36 పైసలు నష్టపోయి 87.31 వద్ద స్థిరపడింది. గత నెల 25న రూపాయి ఒకేరోజు 47 పైసలు నష్టపోయిన విషయం తెలిసిందే. దీనితర్వాత ఈరోజు అత్యధికంగా పడిపోయింది. డాలర్‌తో పాటు మిగతా ఆరు కరెన్సీలు కూడా

# గాజాకు విద్యుత్ కట్

## ఇజ్రాయిల్ దుశ్చర్య
## ఉప్పునీటిని మంచినీటిగా మార్చే ప్లాంట్‌కు ఆగిన విద్యుత్
## పాలస్తీనా వాసులకు తాగునీటి కష్టాలు

గాజా: కతార్‌లో కాల్పుల విరమణ రెండో దశ ఒప్పందంపై చర్చలు జరగడానికి ముందుగా గాజాకు ఇజ్రాయిల్ విద్యుత్‌ను నిలిపివేసింది. హమాస్ ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. సెంట్రల్, దక్షిణ గాజా ప్రాంతాల్లోని ప్రజలకు తాగు నీరు అందజేసే, కీలకమైన ఉప్పునీటిని మంచినీరుగా మార్చే ప్లాంట్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని అమానవీయమైన చర్యగా హమాస్ పేర్కొంది. పాలస్తీనియన్లను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఇటువంటి చవకబారు, ఆమోదయోగ్యం కాని ఎత్తుగడలను ఉపయోగించడాన్ని ఖండించింది. పాలస్తీనియన్ల జాతిని నిర్మూలించే దురుద్ధేశంతోనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని పాలస్తీనా అథారిటీ విమర్శించింది. గాజాలో మానవతా విపత్తును సృష్టించాలన్న కుట్రలో భాగంగానే ఈ చర్యలన్నీ అమలు చేస్తున్నారని పాలస్తీనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి కూడా తాజా పరిణామాలను ఖండించారు. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యలకు పాల్పడుతోందని, నీరు, విద్యుత్‌లను వారికి అందకుండా చేయాలని చూస్తోందని హ్యూమన్ రైట్స్ వాచ్ విమర్శించింది.కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధ రించే లక్ష్యంతో ఈజిప్ట్, కతార్, అమెరికా మధ్యవర్తులుగా దోహాలో చర్చలు ప్రారంభం కావాల్సి వున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిణా మాలు చోటు చేసుకున్నాయి. గాజాకు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సిందిగా బ్రిటన్, ఇజ్రాయిల్‌ను కోరింది. తాజా వార్తల



పట్ల బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని ఆయన తరపు అధికార ప్రతినిధి తెలిపారు. గాజా ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు అందకుండా చేయడమనేది అంతర్జాతీయ మానవతా చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని చెప్పారు.

పాలస్తీనా విద్యార్థి నేత అరెస్టు: విద్యార్థుల కార్యకలాపాల పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పాలస్తీని విద్యార్థి నేత మహ్మద్ ఖలీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అమెరికా హెూమ్‌ల్యాండ్ భద్రతా విభాగానికి చెందిన ఏజెంట్లు పాలస్తీనా కార్యకర్త, కొలంబియా యూనివర్శిటీ మాజీ విద్యార్థి మహ్మద్ ఖలీల్‌ను శనివారం అరెస్టు చేశారు. న్యూయార్క్ నగరంలోని ఆయన నివాసంలోనే ఈ అరెస్టు జరిగింది.

కొలంబియా యూనివర్శిటీలో పాలస్తీనా సంఘీభావ ఉద్యమ కార్యకలాపాల్లో ఖలీల్ క్రియాశీలంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ)లో ఖలీల్‌ను నిర్బంధంలో వుంచారు. అక్కడ నుండి బహుశా ఆయనను తరలించే అవకాశం వుంది. గర్భవతి అయిన ఆయన భార్య చూసేందుకు వెళ్లగా అక్కడ లేరని, ఆయన ఆచూకీ గురించి కూడా వివరాలు తెలియజేయలేదని ఆయన తరపు న్యాయవాది అమీ గ్రీర్ చెప్పారు.

# యాక్షన్ ప్లాన్ లో జలమండలి...

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** జలమండలి పరిధిలో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. గతేడాది 1,94,747 వాటర్ ట్యాంకర్లను బుక్ చేయగా.. ఈ ఏడాది జనవరిలో 1,19,752, ఫిబ్రవరిలో ఇప్పటికే దాదాపు 1.50 లక్షల ట్యాంకర్లను డెలివరీ చేసినట్లు జలమండలి అధికారిక లెక్కలు చెబుతున్నా యి. నగరంలోని చాలా చోట్ల భూగర్భజలాలు పడిపోవడం, నివాసాల్లోని బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల బుకింగ్స్ పెరుగుతు న్నాయి. డెలివరీలు కూడా అదే స్థాయిలో పెరుగుతుండటం గమనార్హం. జలమండలి డెలివరీ చేస్తున్న వాటర్ ట్యాంకర్ల గణాంకాలను పరిశీలిస్తే గతేడాది కంటే ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 40శాతం పెరిగింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ట్యాంకర్లకు మరింత ఎక్కువ డిమాండ్ వచ్చే పరిస్థితులున్నాయి. నగరంలో ఏటా వాటర్ ట్యాంకర్లకు డి మాండ్ పెరుగుతోంది. 2022లో 32శాతం, 2023లో 19శాతం, 2024లో 31శాతం, ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే 37 శాతం డిమాండ్ పెరిగింది. వినియోగదారు ల నుంచి వస్తున్న డిమాండ్‌కు తగ్గట్లుగా ట్యాంకర్‌ను బుక్ చేసిన 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్లకు కొన్ని ప్రాంతాల్లోనే ఎక్కువగా డిమాండ్ ఉండటం గమనార్హం. జలమండలి పరిధిలోని మణికొండ, దుర్గంచెరువు, కూకట్‌పల్లి, ఎస్ఆర్‌నగర్, నిజాంపేట్, హీఫీజ్‌పేట్, ఆసిఫ్‌నగర్, అల్వాల్, రాజేంద్రనగర్, జూబ్లీహి ల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌళి, మాదాపూర్, అమీర్ పేట్, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా బుకిం గ్స్, డెలివరీలు జరుగుతున్నాయి. కాగా జలమండలి సరఫరా చేసే వాటర్ ట్యాంకర్ల కోసం 24 గంటలు వేచి ఉండాలా అనే ఉద్దేశంతో కొన్ని ప్రాంతాల్లో పలువురు వినియో గదారులు, కమర్షియల్ కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్‌ల నిర్వాహకులు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారు. వాటర్ ట్యాంకర్ల బుకింగ్స్ పెరుగుతున్నందున జలమండలి అధికారులు ముం దస్తు చర్యలు చేపడుతున్నారు. జలమండలి పరిధిలో గతేడాదిలో 69 ఫిల్లింగ్ స్టేషన్లు, 93 ఫిల్లింగ్ పాయింట్లు, 577 వాటర్ ట్యాంకర్లు ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 79 ఫిల్లింగ్ స్టేషన్లు, 123 ఫిల్లింగ్ పాయింట్లు, 907 వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ఒక్కో వాటర్ ట్యాంకర్ నిండేందుకు దాదాపు 8- నిమిషాల సమయం పడుతున్నట్లు గుర్తించి, ఫిల్లింగ్ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించారు. తద్వారా ఎక్కువ ట్రిప్పులను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు...

## డంకీ మార్గంలో వెలుతూ మృత్యువాత
## గుజరాత్‌కు చెందిన వ్యక్తి మృతి

అహ్మదాబాద్: అక్రమంగా అమెరికాకు దొడ్డిమార్గంలో వెళ్తున్న భారతీయులను ఆ దేశం వెనక్కి పంపిస్తున్నప్పటికీ కొందరు దీనినే ఎంచుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. భారతీయులు అక్రమంగా ఇతర దేశాలకు వెళ్లడం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ కొందరు ప్రమాదకరమైన డంకీ మార్గాల్లో అగ్రదేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఈనేపథ్యంలోనే తాజాగా గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో సహా డంకీ రూట్ లో అమెరికాకు వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. మృతుడిని గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలోని మోయద్ గ్రామానికి చెందిన దిలీప్ పటేల్‌గా గుర్తించారు. దిలీప్ పటేల్ అమెరికాలో స్థిరపడాలనే ఆలోచనతో ఇటీవల ఓ ఏజెంట్‌ను సంప్రదించారు. తన భార్య, చిన్నారితో సహా ముగ్గురిని అమెరికా పంపడానికి రూ.కోటి చెల్లించాలని వారు కోరడంతో తమ భూమిని విక్రయించి.. వచ్చిన రూ.కోటి చెల్లించినట్లు స్థానికులు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం అతడు కుటుంబంతో సహా టూరిస్ట్ వీసాపై దుబాయ్ వెళ్లి, అక్కడి నుంచి నికరాగ్వాకు వెళ్లాడు. అక్కడినుంచి డంకీ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మధుమేహ వ్యాధిగ్రస్తుడైన దిలీప్ అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో అతడికి మందులు లభించకపోవడంతో అనారోగ్యం తీవ్రమై కోమాలోకి జారుకొని మృతి చెందాడని అధికారులు పేర్కొన్నారు. కాగా మృతుడి భార్యాబిడ్డలు అక్కడే చిక్కుకుపోయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి విదేశాంగ శాఖ సహాయం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి (ఫ్గ÷గ్గ÷ణజీ ఓతిణసజీనిబిబ) గుర్తింపు, తరలింపు పక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే.

## మెట్లు ఎక్కగానే ఇక అయ్యప్ప దర్శనం
### మార్పులకు శ్రీకారం చుట్టిన బోర్డు
### అమల్లోకి నిర్ణయం

తిరువనంతపురం,: శబరిమల అయ్యప్ప ఆలయంలోని సన్నిధానంలో 18పవిత్ర మెట్లను అధిరోహించిన వెంటనే భక్తులు నేరుగా స్వామి దర్శనం అయ్యేలా మార్పులు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) నిర్ణయించింది. ఈ మార్పును ఈ నెల రోజుల పాటు విష్ణు పూజ జరిగే రోజుల్లోప్రయోగాత్మకంగా అమలు చేస్తామని టీడీబీ అధ్యక్షుడు పి.ఎస్. ప్రశాంత్ వెల్లడించారు. ఇదివిజయవంతమైతే తదుపరి మండల మకరవిళక్కు సీజన్‌లోనూ దీన్ని కొనసాగిస్తామని తెలిపారు. మెట్లను ఎక్కిన వెంటనే ప్రస్తుతం భక్తులను ఒక వంతెన మీదికి మళ్లిస్తున్నామని అక్కడ వారు కొంత సమయం క్యూలో వేచి ఉండి అనంతరం స్వామి దర్శనం కోసం మరోవైపునకు వెళ్తున్నారని ప్రశాంత్ చెప్పారు. ఈ పద్ధతిలో భక్తులకు కేవలం ఐదు సెకన్ల వరకే దర్శనభాగ్యం దక్కుతోందన్నారు. భక్తులు మెట్లు ఎక్కిన వెంటనే దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త మార్పు కారణంగా ప్రతి భక్తునికి 20నుంచి 25సెకన్ల పాటు దర్శనం చేసుకునేవీలు కలుగుతుందన్నారు. అలాగే మెట్లు ఎక్కగానే స్వామి దర్శనం జరిగిందన్న అనుభూతి కూడా ఉంటుందని భావిస్తున్నారు. మెట్లు ఎక్కగానే దర్శనం కలగాలని మాలధారులు కూఆ కోరుకుంటున్నారు.

# ఆఫ్రికా ఐలాండ్ లో లలిత్ మోడీ

ముంబై: లలిత్ మోడీ విభిన్నమైన వ్యక్తి. వ్యాపార కిటుకులు తెలిసిన వ్యక్తి. పైగా క్రికెట్ కు కార్పొరేట్ రంగులు అద్దిన వ్యక్తి. అందువల్లే ఐపిఎల్ అనేది ఏర్పడింది. ఇంతలా అభివృద్ధి చెందింది. మంచి వెనుక చెడు ఉన్నట్టు.. ఐపీఎల్ ను మానస పుత్రిక లాగా అభివర్ణించుకున్న లలిత్ మోడీ.. ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. ఫలితంగా ఆర్థిక నేరగాడిగా ముద్రపడ్డాడు. చివరికి దేశం విడిచి వెళ్లిపోయాడు. ప్రస్తుతం విదేశాలలో తల దాచుకుంటున్నాడు. అతడిని ఇండియాకి తీసుకురావడానికి ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ.. విఫలమవుతూనే ఉన్నాయి.. లలిత్ మోడీ కొన్ని సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్నాడు. ఆ మధ్య అతడు సుస్మితాసేన్ తో కలిసి ఉంటున్నట్టు ప్రచారం జరిగింది. దానికి సంబంధించిన ఫోటోలను కూడా లలిత్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశాడు.చాలా సంవత్సరాలుగా ఇంగ్లాండ్ లో ఉంటున్న లలిత్.. తనను ఎప్పుడైనా సరే భారత ప్రభుత్వం స్వదేశానికి తీసుకెళ్లి ఇబ్బంది పడుతుందని భావించి.. ఇంగ్లాండ్ నుంచి కూడా లలిత్ వెళ్లిపోయాడు. ఏకంగా "వనువాటు" అనే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. వనువాటు అనేది 80 ద్వీపాల సమూహం. ఇది పసిఫిక్ మహాసముద్రంలో ఉంటుంది. ఇక్కడ ఆదాయపు పన్ను.. ఇతర టాక్స్ లు ఉండవు. ఈ ప్రాంతం క్రిప్టో కరెన్సీకి స్వర్గధామం గా ఉంది. 2024 లో హ్యాపీ ప్లానెట్ ఇండెక్స్ లో ఈ దేశం తొలి స్థానంలో ఉంది. మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్.. స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోవడానికి వను వాటు వెళ్లినట్టు తెలుస్తోంది.. లలిత్ మొదట్లో ఐపిఎల్ వ్యవహారాలను సక్రమంగానే నిర్వహించినప్పటికీ..



ఆ తర్వాత దారి తప్పాడు. ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డాడు. చివరికి దేశం విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కొద్దిరోజులుగా ఇంగ్లాండ్లో తల దాచుకున్నాడు. ఇప్పుడు ఏకంగా వనువాటు వెళ్లిపోయాడు. అయితే ఆ దేశం పౌరసత్వం తీసుకోవడానికి లలిత్ ఎంత స్థాయిలో నగదు చెల్లించాడు అనేది బయటికి తెలియ రాలేదు. లలిత్ మోడీ ఐపీఎల్ ను అభివృద్ధి చేసింది నిజమే అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాడని అతనిపై అభియోగాలు ఉన్నాయి. 2010 నుంచి అతడు ఇంగ్లాండ్ లో తల దాచుకుంటున్నాడు. అయితే ఇప్పుడు అతడు వేరే దేశం పౌరసత్వం తీసుకున్నాడు. దీంతో అతడు భారతదేశానికి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఎందుకంటే అతడు పౌరసత్వం తీసుకున్న దేశంలో ఉన్న నిబంధనలే దానికి కారణమని తెలుస్తోంది.

# ప్రజారోగ్యానికి ముప్పు




రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతున్న వైద్య కళాశాలలకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాను వర్తింపజేసే టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే మిణుకు మిణుకుమంటున్న ప్రజారోగ్యాన్ని మరింత చీకటిమయం చేస్తుంది. వైద్య విద్యను మరింతగా ప్రైవేటీకరిస్తుంది. ప్రభుత్వ ప్రతిపాదిత 'పిపిపి' మోడల్ ప్రైవేటు, కార్పొరేట్ల లాభాలకు బాగా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంవత్సరాల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని గత వైసిపి ప్రభుత్వం తలచింది. కొత్తగా నెలకొల్పబోయే కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టగా, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకొస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ప్రజలు నిజమే కాదా అని నమ్మారు. అధికారంలోకొచ్చాక పి-3 అనడం ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే. సెల్ఫ్‌ఫైనాన్స్ అని వైసిపి సర్కారు వైద్య విద్యార్థుల భవిష్యత్తును పెనం మీదికి నెట్టగా కూటమి ప్రభుత్వం ఏకంగా పొయ్యిలోకి తోసినట్లయింది. రాష్ట్ర విభజన తర్వాత వైద్య విద్యలో కానీ, వైద్య మౌలిక సదుపాయాల్లోకానీ ఎ.పి. పరిస్థితి తెలంగాణతో పోల్చితే వెనకబాటులో ఉంది. విభజనతో నష్టపోయిన రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య, సౌకర్యాలు పెరగాలి. నవ్యాంధ్రలో పాలన చేసిన వైసిపి, టిడిపి ఆలోచన ఆ దిశలో లేదు. రాష్ట్రంలో ఆరు వేల వరకు ఎంబిబిఎస్ సీట్లుండగా సగం ప్రైవేటులోనివే. మొత్తం 36 మెడికల్ కాలేజీలు ఉండగా సగం ప్రైవేటువే. స్థానికంగా ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదవాలంటే లక్షలు కుమ్మరించాలి. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ శూన్యం. రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన మోతుబరుల చేతుల్లో ప్రైవేటు మెడికల్ కాలేజీలున్న నేపథ్యంలో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఆశించడం శుద్ధ దండగ. అన్నేసి లక్షలతో ప్రైవేటు కాలేజీల్లో సీట్లు కొనలేక వైద్య విద్యపై ఆసక్తి ఉన్న ఔత్సాహిక యువత తమ ఆలోచనను విరమించుకుంటున్నారు. మరికొంత మంది తక్కువ ఖర్చులో మెడిసన్ చేసేందుకు చైనా, ఫిలిప్పైన్స్, ఉక్రెయిన్ తదితర దేశాలకు వలస పోతున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతారని విద్యార్థులు ఎంతో ఆశ పడ్డారు. పి-3 మోడల్ అని ప్రభుత్వం వారి ఆశలను అడియాశలు చేసింది. కూటమి సర్కార్ ప్రకటించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' నినాదం ఐశ్వర్య, ఆరోగ్య, ఆనంద రాష్ట్రాన్ని నిర్మించడం. ప్రజలందరూ ఆరోగ్యవంతులు కావాలంటే ఆ రంగానికి బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించాలి. జిడిపిలో కనీసం 2.5 శాతం ప్రజారోగ్యానికి ప్రభుత్వాలు ఖర్చు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఆరోగ్యాంధ్ర చేస్తామంటున్న కూటమి సర్కారు తన బడ్జెట్‌లో ఆరు శాతం ఇవ్వడం కనాకష్టమైపోయింది. చివరికి ఎంత ఖర్చు చేస్తారో తెలీదు. ఆస్పత్రుల్లో మందుల్లేవని అధికార సభ్యులే అసెంబ్లీలో గోల చేశారు. 108, 104 సేవలు, ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవ అరకొరే. డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు వేలాదిగా ఉన్నాయని స్వయాన మంత్రి శాసనసభకు సెలవిచ్చారు. డాక్టర్ పోస్టులకు ఎన్నిసార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా రాకపోవడానికి కారణం లక్షలు పోసి ప్రైవేటు కాలేజీల్లో చదివిన వారికి సంపాదన, కెరీర్ పరమావధిగా దేశీయ కార్పొరేట్‌ఆస్పత్రులు, విదేశాల బాట పట్టడమే. ప్రతి వెయ్యి మందికీ ఒక క్వాలిఫైడ్ డాక్టర్ ఉండాలని డబ్ల్యుహెచ్‌ఒ నిర్దేశించిం ది. తామొచ్చాక ఆ టార్గెట్‌ను దాటేశామంటోంది మోడీ ప్రభుత్వం. నగరాలు, పట్టణాల్లో ఆ నిష్పత్తిలో వైద్యులుండవచ్చునేమో కానీ గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు చాలా చాలా అధమ స్థాయిలో ఉన్నాయనడానికి ఏజెన్సీలో తరచు కనిపించే డోలీ మోతలే నిదర్శనం. ఆరోగ్యం ప్రజల హక్కు. అది సాకారం కావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య సదుపాయాలు పరిపుష్టం కావాలి.

# సందీప్‌రెడ్డి షరతుల చిట్టా?





ఫౌజీ, ది రాజాసాబ్ సినిమాల షూటింగుల్లో అగ్రహీరో ప్రభాస్ బిజీగా ఉన్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' స్క్రిప్ట్, ప్రీప్రొడక్షన్ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ప్రభాస్ తాను చేస్తున్న రెండు సినిమాలను ముగించే వరకూ సందీప్‌రెడ్డి సైలెంట్ గానే ఉంటారట. 'స్పిరిట్' లొకేషన్‌లోకి ప్రభాస్ ఎంట్రీ ఇచ్చాక, ఇక పూర్తిగా తన ఆధీనంలోనే ఉండాలనే షరతుని ప్రభాస్ ముందుం చారట సందీప్‌రెడ్డి వంగా. ఇంకా ప్రభాస్ ముందు ఆయన ఉంచిన షరతులు ఇలా ఉన్నాయి. ' 'స్పిరిట్' పూర్తయ్యే వరకూ మరో సినిమా చేయకూడదు. ఆ లుక్‌తో బయట కనిపించకూడదు. వారా నికి ఒకరోజో, రెండ్రోజులో కాల్షీట్లు ఇస్తే కుదరదు.. బంచ్‌గా కాల్షీట్లు కావాలి. బాడీ డబుల్స్‌పై ఆధారపడి షాట్లు తీయను.. నా లొకేషన్‌లో డూప్ ప్రస్తావన రాకూడదు..'ఇవీ సందీప్‌రెడ్డి కండీషన్లు.హీరో అనేవాడు సందీప్‌రెడ్డి వంగాకి సరండర్ అయితే.. అతను ఎలాంటి అవుట్‌పుట్ ఇస్తాడో.. అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాలు చెప్పేశాయి. అందుకే ప్రభాస్ కూడా 'సరే' అన్నారట. ప్రస్తుతం ఈ షరతుల చిట్టా ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నది. 'స్పిరిట్'లో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌ఆఫీసర్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. కరీనాకపూర్, సైఫ్ అలీఖాన్ దంపతులు ఇందులో విలన్లుగా నటిస్తు న్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది చివర్లోకానీ, 2027 ప్రథమార్ధంలోగానీ 'స్పిరిట్' విడుదలయ్యే అవకాశం ఉంది.

# మూడోసారి ముచ్చటగా?




విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' తర్వాత మళ్లీ తెలుగు సినిమా చేయలేదు సమంత. తెలుగుతెరపై ఆమె పునరాగమనం కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు సామ్ టాలీవుడ్ రీఎంట్రీకి ముహూర్తం కుదిరినట్టు విశ్వసనీయ సమాచారం. సమంతతో జబర్దస్త్, ఓ బేబీ సినిమాలను తెరకెక్కించిన లేడీ డైరెక్టర్ నందినీరెడ్డి ఇటీవలే సమంతకు ఓ కథ వినిపించారట. దానికి సామ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుస్తున్నది. సమంత కెరీర్‌లోనే 'ఓ బేబీ'ని మెమరబుల్ మూవీ అని చెప్పొచ్చు. మరి ఈ సారి సమంతతో నందినీరెడ్డి ఎలాంటి సినిమా చేస్తారో చూడాలి.

# కాశీ నేపథ్యంలో మహేశ్ సినిమా?

మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న జంగిల్ అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. లార్జర్ దేన్ లైఫ్ కథాంశాలతో వెండితెరపై మ్యాజిక్ చేస్తుంటారు రాజమౌళి. ఈ నేపథ్యంలో ఈ సినిమా కథేమిటన్నది అందరిలో ఆసక్తిని పెంచుతున్నది. అమెజాన్ అడవుల నేపథ్యంలో ట్రెజర్ హంట్ కథాంశమిదని గతంలో వార్తలొచ్చాయి.

తాజా సమాచారం ప్రకారం ఈ కథలో కాశీ నేపథ్యం కీలకంగా ఉంటుందని తెలిసింది. భారతీయ పురాణాలతో సంబంధం కలిగిన అడ్వెంచరస్ జర్నీగా రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. హనుమంతుడి స్ఫూర్తితో కథానాయకుడి పాత్రను తీర్చిదిద్దారని ప్రచారం జరుగుతున్నది. కాశీ నేపథ్య సన్నివేశాల కోసం హైదరాబాద్‌లో కాశీ పట్టణాన్ని తలపించేలా సెట్స్ నిర్మాణం జరుగుతున్నదని తెలుస్తున్నది. మైథాలజీ, హిస్టరీలతో కూడిన అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రాజమౌళి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఒడిశాలోని కోరాపుట్ పర్వతపంక్తుల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది.



# సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ గా అమృత



హైదరాబాద్,: ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసుకు సంబంధించి న్యాయస్థానం తుది తీర్పు వెల్లడించింది. 2018లో జరిగిన ఈ హత్యకు సంబంధించి మొత్తం 8 మందిని పోలీసులు నిందితులుగా గుర్తించారు. ఏ1 అయిన అమృత తండ్రి మారుతి రావు విచారణ జరుగుతుండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. మిగతా ఏడుగురిలో ఏ2, హంతకుడు సుభాష్ శర్మకు ఉరిశిక్ష పడింది. అమృత బాబాయ్ శ్రవణ్ సహా ఇతర దోషులకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ జిల్లా రెండవ అదనపు సెషన్స్, ఎస్సీ ఎస్టీ కోర్టు తీర్పు వెల్లడించింది. ఈ కేసు తీర్పుపై ప్రణయ్ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ప్రణయ్ హత్య కేసుతీర్పు వెలువడిన నేపథ్యంలో అమృత మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఇంతకీ ఆమె ఏం చేస్తుంది? ఎక్కడ ఉంటుంది? అనే అంశాల మీద నెటిజన్లు ఆరా తీస్తున్నారు. ప్రణయ్ హత్య సమయంలోనే ఆమె ప్రెగ్నెంట్.పరీక్షలకోసం అమృతను హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగానే దుండగులు అతడిని హత్య చేశారు. అప్పుడు ఆమె 5 నెలల గర్భవతి. ఆ తర్వాత ఆమెకు ఓ బాబు పుట్టాడు. కొంతకాలం తర్వాత ఆమె అత్తామామల ఇంట్లోనే ఉన్నది. కొద్ది నెలల తర్వాత ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో మళ్లీ తన తల్లికి దగ్గర అయ్యింది. కొంతకాలం తర్వాత అమృత సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ గా మారింది. పలు రకాల బ్రాండ్లను సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ప్రమోట్ చేస్తున్నది. తన ఛానెల్ లో వ్యక్తిగత జీవితం, కొడుకుతో గడిపే క్షణాలుతో పాటు లైఫ్ స్టైల్, ఫ్యాషన్ రంగాలకు సంబంధించిన వీడియోలను షేర్ చేస్తున్నది. ఇన్ స్టా, ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఛానెల్ ద్వారా అనేక విషయాలను పంచుకుంటున్నది. ప్రస్తుతం అమృత కొడుక్కు సుమా రు 6 ఏళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె తన తల్లితో కలిసి హైదరాబాద్ లోనే ఉంటుంది. అప్పుడప్పుడు మిర్యాలగూడకు వెళ్లి వస్తుంటారు. ఇందుకు సంబంధిచిన వీడియోలను అమృత సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంటుంది. ఇప్పుడిప్పుడే ప్రణయ్ హత్యకు సంబంధించిన చేదు జ్ఞాపకాలను ఆమె మర్చిపోయే ప్రయత్నం చేస్తున్నది. తన కొడుకుతో కలిసి సంతోషంగా జీవిస్తోంది.అమృతతో ప్రణయ్ కి స్కూల్ డేస్ నుంచే పరిచయం ఉంది. చిన్నప్పటి నుంచే స్నేహితులు. ఆ తర్వాత నెమ్మదిగా ఒకరిపై మరొకరికి ఇష్టం ఏర్పడింది. ఇద్దరూ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ప్రేమలో పడ్డారు. పెళ్లి చేసుకుంటామని అమృత ఇంట్లో అడిగితే, ఆమె తండ్రి మారుతిరావు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో జనవరి 31, 2018లో ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రణయ్ మాల కులానికి చెందిన అబ్బాయి కాగా, అమృతది వైశ్య సామాజిక వర్గం. అమృత తండ్రి రియల్ ఎస్టేట్ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తనను కాదని పెళ్లి చేసుకున్నారనే కోపంతో మారుతిరావు కిరాయి హంతకులతో ప్రణయ్ ని హత్య చేయించాడు. ఈ కేసులో మారుతీరావును ఏ1గా చేర్చగా అతడి తమ్ముడు శ్రవణ్ ను ఏ6గా పేర్కొన్నారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి తుది తీర్పు వెల్లడైంది.

# నిండా ముంచుతున్న మొక్కజొన్న..!



**వరంగల్,తెలంగాణ దిశ:** జన్యుమార్పిడి ఆహార పంటలు పర్యావరణానికి చాలా డేంజర్. ఎందుకంటే అది పర్యావరణంపై ఎలాంటి ఎఫెక్ట్ చూపుతుందో ఊహించడం కష్టం. సంప్రదాయ మొక్కలకు సమస్య. కానీ మారుమూల ప్రాంతాల్లో విత్తనోత్పత్తి కోసమంటూ రహస్యంగా ప్రయోగాలు చేస్తుండడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ములుగు జిల్లా వెంకటాపూర్ పరిసరాల్లో మొక్కజొన్న సాగు జోరుగా సాగుతోంది. ఇప్పుడు దిగుబడి రాక సీడ్ ఆర్గనైజర్ చేతులెత్తేయడంతో మ్యాటర్ మొత్తం బయటపడింది. ఈ మొక్కజొన్న సాగు చుట్టూ ఎన్నో డౌట్లు అలాగే ఉన్నాయి. జవాబులే రావాల్సి ఉంది.ఈ మొక్కజొన్న పొత్తుల్ని చూడండి.. ఇది సీడ్స్ ఉత్పత్తి కోసమంటూ ఏజెన్సీ ఏరియాల్లో పండిస్తున్న పంట. సీడ్స్ కోసం పత్తి అయినా మరొకటైనా రైతులతో ఒప్పందాలు చేసుకుని పండించడం ఒకెత్తు. కానీ ఇక్కడ మాత్రం ఇవేవీ లేవు. అంతా సీక్రెట్. సీడ్స్ తేవడం, స్థానిక రైతులకు పండించాలని చెప్పడం, పంట మొత్తం కొంటామని నమ్మించడం ఇదే జరుగుతోంది. ఇప్పుడు దిగుబడి రాక సీడ్ ఆర్గనైజర్ అడ్రస్ లేకుండా పోవడం రైతులు రోడ్డెక్కడంతో కార్న్ సీడ్స్ చుట్టూ డార్క్ సీక్రెట్స్ అన్నీ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి.గద్వాల్, ఉమ్మడి మహబూబ్ నగర్ ఏరియాల్లో అక్కడక్కడ కాటన్ సీడ్స్ కోసం పంట పండిస్తుంటారు. కానీ ములుగు జిల్లాలో మాత్రం మొక్కజొన్న సీడ్స్ కోసమంటూ ప్రయోగాలు చేస్తున్నారా.. లేకుంటే ఇది జన్యుమార్పిడి మొక్కజొన్న పంటా అన్నది కీలకంగా మారింది. ఎందుకంటే జన్యుమార్పిడి ఆహార పంటలు పండించాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు తీసుకోవాలి. ఇష్టంవచ్చినట్లు చేయడానికి వీల్లేదు. ఎందుకంటే జీన్ మోడిఫైడ్ సీడ్స్ తో బయోడైవర్శిటీకి ముప్పు ఉంటుంది. మనం తినే ఫుడ్స్ లో మారిపోయి అది ఆరోగ్యంపై ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుందో అంచనా వేయడం కష్టం. అందుకే వీటి అనుమతుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.మెయిన్ క్వశ్చన్ ఏంటంటే.. ములుగు ఏరియాలో పండిస్తున్న మొక్కజొన్న క్రాప్ జెనెటికల్లీ మోడిఫైడా కాదా అన్నది ఒకటి.. సీడ్స్ కోసమే పండిస్తున్నారా అన్నది ఇంకొకకటి. ఒకవేళ సీడ్స్ కోసమే పండిస్తే అనుమతులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు ఎక్కడ? ఒకవేళ జన్యుమార్పిడి విత్తనాలను నేరుగా తీసుకొచ్చి సాగు చేయిస్తుంటే ఆ అనుమతులు ఏవి? అన్నది కీలకంగా మారాయి. ములుగు ఏరియాలో సాగవుతున్న మొక్క జొన్న క్రాప్ చుట్టూ సవాలక్ష డౌట్లు పెరుగుతున్నాయి. ఒక్కసారి ఈ విత్తన బ్యాగ్ చూడండి.. దీనిపై పేరు లేదు ఊరు లేదు. జస్ట్ ఒక కోడ్ మాత్రమే ఉంది. ఇది కూడా పెద్ద డౌట్. రైతులు చెబుతున్నదాని ప్రకారం ఈ సీడ్స్ అన్నీ విదేశాల నుంచే వస్తున్నాయంటున్నారు. అదే జరిగితే క్వారంటైన్ ఎటు వెళ్లింది.. చెకింగ్స్ ఏమి చేశారు.. ఇక్కడిదాకా ఎలా వచ్చాయి అన్నది కీలకంగా మారుతున్నాయి. అడ్రస్ లేకుండా వెళ్లిన సీడ్ ఆర్గనైజర్స్ ను పట్టుకుంటేనే అసలు నిజాలు తెలుస్తాయంటున్నారు. నిజానికి బీటీ కాటన్ చాలా మందికి తెలుసు. గతంలో పత్తి దిగుబడులు రాక చీడపీడల కారణంగా రైతులు చాలా నష్టపోయే వారు. కానీ బీటీ ఎప్పుడైతే ఎంటర్‌అయిందో పత్తి దిగుబడులు పెరిగాయి. చీడపీడల బాధలు తప్పాయి. బీటీ అంటే బాసిల్లస్ థురెంజియెన్సిస్. ఇందులో క్రై2 ఏసీ అనే జన్యువు కీలకంగా ఉంటుంది. ఇది పత్తిని ఆశించే పురుగు పత్తి ఆకును తినగానే చనిపోయేలా చేస్తుంది. విషపూరితం అన్న ఇది వాణిజ్య పంట అయిన పత్తికి వర్కవుట్ అయింది. అదే ఆహార పంటల్లో ఇలా జన్యుమార్పిడి చేస్తే అది తినే జనాలు, పశు పక్ష్యాదులపై ఎలాంటి డేంజర్ ఎఫెక్ట్ చూపుతుందన్నది క్వశ్చన్ మార్క్. అందుకే వీటి అనుమతులు అంత సులువుగా రావుకానీ మొక్కజొన్నపై చాలానే కుట్రలు జరుగుతున్నాయనడానికి ఇదొక ఎగ్జాంపుల్ మాత్రమే. గతేడాది తమిళనాడులో కూడా ఈ జన్యుమార్పిడి మొక్కజొన్న క్రాప్ చుట్టూ పెద్ద రగడే నడిచింది. 2021 మార్చిలో మొక్కజొన్న సహా 24 ఆహార పంటలను దిగుమతి చేసుకోవడానికి జీఎం ? ఫ్రీ సర్టిఫికెట్ తప్పనిసరి చేసింది. ఒక పంట జన్యుమార్పిడా కాదా అన్నది పాలిమరేజ్ చైన్ రియాక్షన్ పద్ధతిలో తెలుస్తుంది. ఇటీవలే నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ సైంటిస్టులు సమర్పించిన జర్నల్‌లో భారత్ లో మొక్కజొన్న ప్రాసెస్డ్ ఫుడ్ ఐటమ్స్ లో జన్యుమార్పిడి చేసిన ఆనవాళ్లను గుర్తించారు. జీఎం పాజిటివ్ వచ్చింది. ఇది ఆందోళనపరిచే విషయం. ఇదే సీన్ ములుగు జిల్లా ఏజెన్సీలో రిపీట్ అయిందా అన్నది శాంపిల్స్ టెస్ట్ చేస్తేనే బయటకు వస్తుందంటున్నారు. ములుగు జిల్లాలో బీటీ మొక్కజొన్న సాగు చేస్తున్నామన్న విషయం అక్కడి గిరిజన రైతులకు కూడా తెలియదు. కొన్ని విత్తన కంపెనీల పేర్లతో కొంతమంది ఆర్గనైజర్లు, ఏజెంట్లు వేసిన ఉచ్చులో పడ్డారు అక్కడి అమాయక రైతులు. మొక్కజొన్న విత్తనాలను సాగు చేస్తే ఎకరాకు 4 టన్నుల పంట దిగుబడి వస్తుందని.. భారీగా ఆదాయం వస్తుందని ఆశ చూపించడంతో.. దాదాపు 5 నుంచి 6 వేల ఎకరాల్లో విత్తనాల కోసమే మొక్కజొన్న సాగు చేశారు అక్కడి రైతులు. కానీ పంట కోసే సమయానికి చూస్తే.. కనీసం ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అంతేకాదు.. ఇక్కడ బీటీ సాగు చేస్తున్నారేమో అన్న అనుమానాలను బలపరచడానికి మరికొన్ని సాక్ష్యాలు కనిపిస్తున్నాయి.విత్తన కంపెనీలకు చెందిన ఆర్గనైజర్లు, ఏజెంట్లు.. రైతులతో మాట్లాడి ఇదిగో ఈ విత్తనాలను నాటించారు. కానీ అధికారికంగా ఎలాంటి అగ్రిమెంట్లు చేసుకోలేదు. రాతపూర్వకంగా ఏ కంపెనీ విత్తనాలను ఇస్తున్నారు.. ఎలా సాగు చేయాలి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎంతకు పంటను కొంటారన్నది లేదు. పైగా రైతులకు విత్తనాలను సరఫరా చేసిన ప్యాకెట్లపై ఏ కంపెనీ పేరు గానీ, సింబల్ గానీ లేదు. కేవలం కొన్ని కోడ్ నెంబర్లు వేసిన తెల్ల సంచుల్లో విత్తనాలను ప్యాక్ చేసి ఇచ్చారు. ఏజెంట్ల మాటలు నమ్మి సాగు మొదలుపెట్టేశారు. కంపెనీ పేర్లను చెప్పి.. పొలాల్లో బోర్డులు కూడా పెట్టలేదు. గిరిజన ప్రాంతాల్లో అదీ చదువు అసలే రాని రైతుల పొలాల్లోనే ఎందుకు వీటిని సాగు చేస్తున్నారు? దిగుబడి రాలేదని తెలిశాక.. విత్తనాలు సరఫరా చేసిన ఏజెంట్లు, ఆర్గనైజర్లు ఎందుకు పరారయ్యారు?ఈసారి మొక్కజొన్న పొత్తుకు గింజలు రాకపోవడంతో ఏజెంట్లు పంట కొనలేదు. నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రైతుల ఆందోళన చేయడంతో మ్యాటర్ అంతా బయటకు వచ్చింది. సంప్రదాయ విత్తనాల తయారీ రైతుల చేతి నుంచి ఎప్పుడో బడా కంపెనీల చేతిలోకి వెళ్లిపోయింది. గతంలో రైతులు విత్తును దాచుకునే వారు. కానీ ఇప్పుడు కంపెనీలు అమ్మినవే కొనే పరిస్థితి వచ్చింది. అయితే చాలా కంపెనీలు డైరెక్ట్ గా రంగంలోకి దిగకుండా దొంగచాటుగా ప్రయోగాలు చేస్తూనే ఉన్నాయి. జీవ వైవిధ్యాన్ని ప్రభావితం చేసేలా ఏ ప్రయోగం చేసినా సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని బయోలాజికల్ డైవర్సిటీ చట్టం 2002 చెబుతోంది.ఇప్పుడు ప్రశ్న ఏంటంటే సీడ్ ఆర్గనైజర్ ఎవరు.. ఏ కంపెనీ కోసం పని చేస్తున్నా రన్నది తేలాలంటున్నారు. ఇల్లీగల్ జీఎం అయితే పర్యావరణానికి ప్రమాదమని గుర్తు చేస్తున్నారు. ఇది విత్తన చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. ఇలా విత్తనాల కోసమే పంటలు సాగు చేయిస్తుంటే రిజిస్టర్ చేసుకోవాలి. అప్పుడు రైతులకు పక్కాగా నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి రిజిస్ట్రేషన్ లేకుండా, కాంట్రాక్ట్ లేకుండా ఆర్గనైజర్స్ రంగంలోకి దిగుతుంటారు. అటు విత్తన కంపెనీలు కూడా డైరెక్ట్‌గా రైతులతో డీల్ చేయవు. మధ్యవర్తులను రంగంలోకి దింపుతాయి. బయోడైవ ర్సిటీ చట్టం ప్రకారం ఉల్లంఘనలు రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, 5లక్షల జరిమానా ఉంటుంది. ఇది ఎంత లెక్క. అందులోనూ దీన్ని నిరూపించి చట్టం ముందు పెట్టే పరిస్థితి ఉందా?

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215